తెలుగు దినపత్రిక
# సిరి
People's Voice వార్త పత్రిక
RNI TG TEL/ 26/A0381
12-09-2026
శనివారం హైదరాబాద్
సంపుటి: (volume): 1
సంచిక: (ISSUE): 215
PUBLISHED FROM HYDERABAD పేజీలు-8 వెల:రూ.4 /–

తెలుగు దినపత్రిక సిరి People's Voice
RNI:TGTEL/26/A0381
siridailynews@gmail.com
/siridailynews
@siridailynews
విలేకరులు కావలెను
ఉన్నత ఆశయంతో ముందుకు పోతున్న సిరి దినపత్రిక లో తెలంగాణలోని అన్ని జిల్లా కేంద్రాలకు స్టాఫ్ రిపోర్టర్స్ తో పాటు, అన్ని జిల్లాలోని నియోజకవర్గ కేంద్రాలకు మరియు మండలాలకు విలేకరులు కావలెను.
99897 78881, 7702344303, 9440451575

## జనగణనలో కులగణనను చేర్చాలి

- కులగణన చేద్దామా వద్దా.. బీజేపీ సభ్యులు సూటిగా చెప్పాలి
- కులగణనతోనే బలహీన వర్గాలకు న్యాయం
- రాష్ట్రంలో చేసిన తీరులో దేశవ్యాప్తంగా సర్వే చేయాలి
- డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క



3

## మత్స్యకారుల బతుకులకు భరోసా



- ఎఫ్టీఎల్ హద్దుల పరిరక్షణపై రాజీ పడబోం
- ఇప్పటికే 44 వేల చెరువులకు జియో ట్యాగింగ్
- నెల్లికల్ ఎత్తిపోతలపై సభాముఖంగా విస్పష్టమైన హామీ
- శాసనమండలిలో మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి

3

## ఓబీసీలకు ప్రత్యేక గుర్తింపు కల్పించాలి

- జనగణనలో ఓబీసీలకు ప్రత్యేక కాలమ్ కేటాయించాలి
- ఓబీసీల సమస్యలపై రాష్ట్ర అసెంబ్లీ ఏకగ్రీవ తీర్మానం చేయాలి
- ఓబీసీల జనాభాపై కచ్చితమైన గణాంకాలుండాలి
- శాసనసభలో బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం



3



2

## కో ఆప్షన్ సభ్యులుగా ట్రాన్స్ జెండర్లు

- శాసనసభలో మంత్రి శ్రీధర్‌బాబు




# స్తంభించిన జెన్‌కో!

## పవర్ స్టేషన్లలో సీఈల ఘెరావ్

- ప్రైవేటు టెండర్లపై విద్యుత్ ఉద్యోగుల ఆగ్రహం
- వైటీపీఎస్ టెండర్ల ఖరారుపై భగ్గుమన్న ఉద్యోగ సంఘాలు
- రాష్ట్రవ్యాప్తంగా థర్మల్ పవర్ స్టేషన్లలో మెరుపు ధర్నాలు
- కేటీపీఎస్, వైటీపీఎస్ కేంద్రాల్లో సీఈ కార్యాలయాల దిగ్బంధం
- రూ.80 కోట్ల నష్టదాయక టెండర్‌ను రద్దు చేయాలని డిమాండ్





**తెలంగాణ బ్యూరో, సిరి న్యూస్:**
తెలంగాణ జెన్‌కోలో యాదాద్రి థర్మల్ పవర్ స్టేషన్ ప్రైవేటు టెండర్ల వ్యవహారం కార్మికులు, ఇంజనీర్లలో తీవ్ర ఆగ్రహ జ్వాలలు రగిల్చింది. సంస్థ రెగ్యులర్ ఉద్యోగులతో పనులు చేయిస్తే ఏకంగా రూ.80 కోట్ల ప్రజాధనం ఆదా అవుతుందని మొరపెట్టుకున్నా బేఖాతరు చేస్తూ.. అదనంగా మరో రూ.80 కోట్ల ప్రజాధనాన్ని కాంట్రాక్టర్‌కు దోచిపెట్టేందుకు యాజమాన్యం టెండర్లు ఖరారు చేయడంతో శుక్రవారం విద్యుత్ రంగం ఒక్కసారిగా అట్టుడికిపోయింది. జెన్‌కో, ట్రాన్స్‌కో ఇంజనీర్లు, కార్మికులు రాష్ట్రవ్యాప్తంగా ఉన్న అన్ని థర్మల్ పవర్ ప్రాజెక్టుల్లో మెరుపు సమ్మెకు దిగారు. ప్రధాన విద్యుత్ ఉత్పత్తి కేంద్రాలైన కేటీపీఎస్, ఎన్టీపీఎస్, వైటీపీఎస్‌లలోని చీఫ్ ఇంజనీర్, సూపరింటెండింగ్ ఇంజనీర్ కార్యాలయాలను ఉద్యోగులు ముట్టడించి ఘెరావ్ చేశారు. టెండర్లను రద్దు చేసేవరకు విధుల్లోకి వెళ్లేది లేదని తేల్చిచెప్పడంతో జెన్‌కో రోజువారీ పరిపాలనా కార్యకలాపాలు పూర్తిగా స్తంభించిపోయాయి.

**ఇచ్చిన హామీని తుంగలో తొక్కారు..**

టెండర్ల విషయంలో గతంలో ఇచ్చిన లిఖితపూర్వక, మౌఖిక హామీలను జెన్‌కో సీఎండీ, పాలకవర్గం పూర్తిగా విస్మరించారని విద్యుత్ జేఏసీ నాయకులు తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. గత నెల 29వ తేదీన జరిగిన సంప్రదింపుల్లో ఉద్యోగుల ప్రయోజనాలకు భంగం కలిగించే ఎలాంటి నిర్ణయాలూ తీసుకోబోమని, వివాదాస్పద అవుట్‌సోర్సింగ్ టెండర్ల ప్రక్రియను తాత్కాలికంగా నిలిపివేస్తున్నామని స్వయంగా యాజమాన్యమే హామీ ఇచ్చిందని గుర్తుచేశారు. ఆ హామీలను తుంగలో తొక్కి, ఉద్యోగుల కళ్లుగప్పి గురువారం సాయంత్రం రహస్యంగా టెండర్లను ఫైనల్ చేసి ప్రభుత్వ తుది

మిగతా 2వ పేజీలో..

## ట్రాక్టర్లపై అసెంబ్లీకి వెళ్లిన బీజేపీ ఎమ్మెల్యేలు



**హైదరాబాద్, సెప్టెంబర్ 11:**
రాష్ట్రంలోని రైతాంగాన్ని ఆదుకోవడానికి కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన ప్రధాన్ మంత్రి ఫసల్ బీమా యోజనను

మిగతా 3వ పేజీలో..

## అటవీ శాఖ అమరుల సేవలు చిరస్మరణీయం

- అడవులు, వన్యప్రాణుల సంరక్షణలో 23మంది సిబ్బంది ప్రాణత్యాగం
- డీజీపీ ఆనంద్
- అమరవీరుల కుటుంబాలకు ప్రభుత్వం అండగా ఉంటుంది
- అటవీ సిబ్బందికి ఆయుధాలు ఇవ్వాలి
- ఎక్సైజ్ శాఖ మంత్రి జూపల్లి



2

## సమగ్ర నివేదికలు సమర్పించాలి

- అసెంబ్లీ, ఎరవెల్లి ఫాంహౌస్ వద్ద ఘటనలపై..
- డీజీపీకి టీజీహెచ్ఆర్సీ ఆదేశం




3

# మళ్లీ పవర్ హాలిడే ముప్పు!

## కరెంట్ కోతలు తప్పవా..



- తెలంగాణలో ట్రాన్స్‌కో ఫెయిల్యూర్?
- రాష్ట్రంలో 19,543 మెగావాట్లకు చేరిన విద్యుత్ డిమాండ్
- ఎల్‌నినో దెబ్బతో అడుగంటిన కీలక జల విద్యుత్ ప్రాజెక్టులు
- 24 గంటలు కాస్తా 7 గంటలకే కుదింపు
- డిస్కమ్‌లలో మొదలైన కరెంట్ పొదుపు ప్రచారం
- యూనిట్‌కు రూ.10 పెట్టి మార్కెట్లో అత్యవసర కొనుగోళ్లు
- ఉత్పత్తి కంటే కొనుగోళ్లే మూడు రెట్లు ఎక్కువ

**తెలంగాణ బ్యూరో, సిరి న్యూస్:**
తెలంగాణ రాష్ట్రంలో విద్యుత్ సరఫరా వ్యవస్థ తీవ్ర సంక్షోభం దిశగా అడుగులు వేస్తోంది. గత నెల రోజులుగా గ్రిడ్‌పై విపరీతంగా పెరుగుతున్న లోడ్, దానిని నియంత్రించే క్రమంలో క్షేత్రస్థాయిలో చోటుచేసుకుంటున్న తీవ్ర అంతరాయాలు రాబోయే పెను ప్రమాదాన్ని ముందే హెచ్చరిస్తున్నాయి. ఎన్నికల వేళ కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన 24 గంటల నిరంతరాయ ఉచిత విద్యుత్ హామీ.. ప్రస్తుతం ఆచరణలో కేవలం 7 గంటల నాసిరకం సరఫరాకే పరిమితమైంది. అటు వర్షాభావ పరిస్థితులు, ఇటు సాంకేతిక వైఫల్యాలతో గ్రామీణ ప్రాంతాల్లో వ్యవసాయం తీవ్ర సంక్షోభంలో మునిగిపోతుండగా, డిమాండ్‌కు తగ్గట్టుగా ప్రసార వ్యవస్థను నడపడంలో టీజీ ట్రాన్స్‌కో ఘోరంగా విఫలమవుతోందన్న విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.

మిగతా 2వ పేజీలో..



## బీజేపీని పక్కకు నెట్టేసిన కాంగ్రెస్–బీఆర్ఎస్ పోరు

- మళ్లీ కాంగ్రెస్ వర్సెస్ బీఆర్ఎస్‌గానే తెలంగాణ రాజకీయం
- అసెంబ్లీ, వీధుల్లో దూకుడుగా గులాబీ దళం
- బీఆర్ఎస్ ఆందోళనలతో మారుతున్న రాజకీయ సమీకరణాలు
- కేసీఆర్–రేవంత్ చుట్టూనే సాగుతున్న పొలిటికల్ వార్
- ప్రధాన ప్రత్యామ్నాయంగా బీజేపీని నిలబెట్టడంలో కమలనాథుల వైఫల్యం

**హైదరాబాద్, సెప్టెంబర్ 10:**
తెలంగాణలో గత మూడు రోజులుగా చోటుచేసుకుంటున్న రాజకీయ పరిణామాలు కాంగ్రెస్, బీఆర్ఎస్ మధ్య పోరే ప్రధానంగా సాగుతున్న విషయాన్ని స్పష్టం చేస్తున్నాయి. పార్లమెంట్ ఎన్నికల్లో కాంగ్రెస్, బీజేపీ చెరో ఎనిమిది స్థానాలు

మిగతా 3వ పేజీలో..

## మా సమస్యలపైనే ఫిర్యాదు చేయాల్సి వచ్చింది

- ప్రజాప్రతినిధులమని చూడకుండా దాడి
- దాడులను ఖండించాల్సిన ప్రభుత్వ పెద్దలు మౌనంగా ఉన్నారు
- మహిళా కమిషన్, ఎన్‌హెచ్ఆర్సీకి బీఆర్ఎస్ మహిళా ఎమ్మెల్యేల ఫిర్యాదు
- తక్షణం డీజీపీని నివేదిక కోరతామన్న మహిళా కమిషన్ చైర్ పర్సన్

**హైదరాబాద్, సెప్టెంబర్ 11 :**
ప్రభుత్వ దుర్మార్గపు పాలనపై ప్రజల పక్షాన పోరాడాల్సిన తాము తమను రక్షించుకునేందుకు, తమ సమస్యను పరిష్కరించుకునేందుకు పోరాడాల్సిన దుస్థితి ఏర్పడిందని మాజీ మంత్రి, ఎమ్మెల్యే సబితా ఇంద్రారెడ్డి ఆవేదన వ్యక్తం చేశారు. అందరూ చూస్తుండగా

మిగతా 8వ పేజీలో..






## ఓవర్సీస్ స్కాలర్‌షిప్ నిధులు రూ.180 కోట్లు విడుదల

- 3,008 మంది ఎస్సీ, ఎస్టీ, బీసీ మైనారిటీ విద్యార్థులకు లబ్ధి

**హైదరాబాద్, సెప్టెంబర్ 11 :**
విదేశాల్లో ఉన్నత విద్యను అభ్యసిస్తున్న తెలంగాణ విద్యార్థులకు ప్రభుత్వం తీపి కబురు అందించింది. సుదీర్ఘకాలంగా ఎదురుచూస్తున్న ఓవర్సీస్ స్కాలర్‌షిప్ నిధులు రూ.179.90 కోట్లు విడుదల చేస్తూ శుక్రవారం ఉత్తర్వులు జారీ చేసింది. ఉప ముఖ్యమంత్రి, ఆర్థిక శాఖ మంత్రి భట్టి విక్రమార్క ఆదేశాల మేరకు ఈ నిధులను త విడుదల చేసినట్లు ఆర్థిక శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ సందీప్ కుమార్ సుల్తానియా శుక్రవారం ఒక ప్రకటనలో వెల్లడించారు.

మిగతా 3వ పేజీలో..

## కో ఆప్షన్ సభ్యులుగా ట్రాన్స్ జెండర్లు

హైదరాబాద్, సెప్టెంబర్ 11 :
రాష్ట్రంలో క్యూర్ పరిధి వెలుపల ఉన్న తొమ్మిది మున్సిపల్ కార్పొరేషన్లలో కో ఆప్షన్ సభ్యులుగా ట్రాన్స్‌జెండర్లను నియమించనున్నట్టు శాసనసభలో మంత్రి శ్రీధర్‌బాబు వెల్లడించారు. ప్రతి కార్పొరేషన్‌లో ఒకరిని ఎంపిక చేస్తామని తెలిపారు. ఈమేరకు తెలంగాణ మున్సిపల్ చట్టం 2019కి సవరణ కోరుతూ ఆయన బిల్లు ప్రవేశపెట్టారు. సామాజికంగా వివక్ష ఎదుర్కొంటున్న ట్రాన్స్‌జెండర్లను ప్రధాన స్రవంతిలోకి తీసుకొచ్చేందుకు ముఖ్యమంత్రి రేవంత్ రేవంత్ రెడ్డి పలు కార్యక్రమాలు చేపట్టారని వివరించారు.

## అనర్హుల ఖాతాలకు రూ.10 వేలు రిఫండ్

హైదరాబాద్, సెప్టెంబర్ 11:
ఇందిరమ్మ ఇళ్ల పథకానికి దరఖాస్తు చేసి లిస్ట్‌లో పేరు రాలేదా.. అయితే మీకు గుడ్ న్యూస్. అప్లికేషన్ సమయంలో డిపాజిట్‌గా చెల్లించిన రూ.10 వేల మొత్తాన్ని హౌసింగ్ బోర్డు తిరిగి దరఖాస్తుదారుల బ్యాంక్ ఖాతాల్లో జమ చేయనుంది. ఈ రిఫండ్ ప్రక్రియ నేటి నుంచి ప్రారంభం కానుందని హౌసింగ్ బోర్డు వర్గాలు వెల్లడించాయి. ఇందిరమ్మ ఇళ్ల కోసం అప్లై చేసే సమయంలో ప్రతి ఒక్కరి నుంచి రూ.10 వేల చొప్పున ధరావతు మొత్తాన్ని తీసుకున్న విషయం తెలిసిందే. అయితే దరఖాస్తులను వివిధ శాఖల రికార్డులతో క్రాస్ చెక్ చేసిన అధికారులు అర్హత లేని దరఖాస్తులను గుర్తించారు. హైదరాబాద్‌లోని 16 నియోజకవర్గాల పరిధిలో ఇందిరమ్మ ఇళ్ల కోసం మొత్తం 60,720 దరఖాస్తులు వచ్చాయి. వీటిని రెవెన్యూ, రవాణా, జీహెచ్‌ఎంసీ తదితర శాఖల నుంచి సేకరించిన వివరాలతో అధికారులు వెరిఫై చేశారు. ఈ వెరిఫికేషన్‌లో భాగంగా 360 డిగ్రీల తనిఖీ చేపట్టిన హౌసింగ్ బోర్డు తొలి దశలోనే సుమారు 40 వేల దరఖాస్తులను అనర్హమైనవిగా గుర్తించింది. దీంతో అర్హత సాధించని వారికి వారు ముందుగా చెల్లించిన రూ.10 వేల మొత్తాన్ని తిరిగి చెల్లించేందుకు చర్యలు చేపట్టింది. ఇందిరమ్మ ఇళ్లకు ఎంపికైన లబ్ధిదారుల్లో కొందరు అప్లికేషన్ సమయంలో తమ మొబైల్ నంబర్లను తప్పుగా నమోదు చేసినట్లు అధికారులు గుర్తించారు. దీంతో ఫోన్ నంబర్ మార్చుకునే అవకాశం కల్పించాలని పలువురు లబ్ధిదారులు కోరారు. దీనిపై స్పందించిన అధికారులు హౌసింగ్ బోర్డు అధికారిక వెబ్‌సైట్‌లోనే మొబైల్ నంబర్ అప్‌డేట్ చేసుకునే సదుపాయాన్ని అందుబాటులోకి తీసుకొచ్చారు. ఎంపికైన లబ్ధిదారులు తమ దరఖాస్తు నంబర్ లేదా ఆధార్ నంబర్ ఉపయోగించి అప్లికేషన్‌లోకి వెళ్లి వివరాలను మార్చుకోవచ్చు. మరోవైపు హైదరాబాద్‌లో ఇందిరమ్మ ఇళ్లకు ఎంపికైన కుటుంబాలపై క్షేత్రస్థాయి సర్వే కొనసాగుతోంది. ఇప్పటివరకు సుమారు 5,500 కుటుంబాలను అధికారులు నేరుగా పరిశీలించినట్లు సమాచారం. లబ్ధిదారుల వివరాలు, అర్హత తదితర అంశాలను క్షేత్రస్థాయిలో చెక్ చేస్తున్న అధికారులు సర్వేను మరో రెండు రోజుల్లో పూర్తి చేసే అవకాశం ఉన్నట్లు తెలుస్తోంది. ఈ ప్రక్రియ పూర్తైన తర్వాత తుది జాబితాను సిద్ధం చేసి హౌసింగ్ బోర్డు వెబ్‌సైట్‌లో అందుబాటులో ఉంచనున్నారు. అంటే అర్హులైన వారికి ఇళ్ల కేటాయింపు ప్రక్రియ ముందుకు వెళ్లనుండగా, అర్హత సాధించని దరఖాస్తుదారులకు మాత్రం వారి రూ.10 వేల డిపాజిట్ తిరిగి రానుంది.

## ట్రాక్టర్లపై అసెంబ్లీకి వెళ్లిన బీజేపీ ఎమ్మెల్యేలు

మొదటిపేజీ తరువాయి
నిరసన వ్యక్తం చేసింది. శుక్రవారం ఉదయం హైదరాబాద్‌లోని ఎమ్మెల్యే క్వార్టర్స్ నుంచి అసెంబ్లీ వరకు బీజేపీ ఎమ్మెల్యేలు, ముఖ్య నాయకులు ట్రాక్టర్లతో భారీ నిరసన ర్యాలీ నిర్వహించారు. రైతుల పంట నష్టపరిహారం, ఇన్సూరెన్స్ విధానంపై రాష్ట్ర కాంగ్రెస్ ప్రభుత్వం అవలంబిస్తున్న తీరును ఎండగడుతూ ఈ వినూత్న నిరసనకు శ్రీకారం చుట్టారు. ఈ ర్యాలీకి బీజేపీ శాసనసభా పక్ష నేతలు, ఎమ్మెల్యేలు, ముఖ్య నాయకులు నేతృత్వం వహించారు. శాసనసభ సమావేశాలు జరుగుతున్న వేళ, రైతుల సమస్యలను సభ దృష్టికి, ప్రభుత్వ దృష్టికి తీసుకెళ్లడమే లక్ష్యంగా ఎమ్మెల్యే క్వార్టర్స్ బయట ట్రాక్టర్లపై ఎక్కి నినాదాలు చేస్తూ అసెంబ్లీ వైపు దూసుకెళ్లారు. రైతుల పట్ల రాష్ట్ర ప్రభుత్వం నిర్లక్ష్య వైఖరి వీడాలని, ప్రకృతి వైపరీత్యాలు, అకాల వర్షాల వల్ల పంటలు నష్టపోయిన ప్రతీ రైతుకు ఫసల్ బీమా యోజన ద్వారా వెంటనే నష్టపరిహారం అందేలా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. బీజేపీ ఎమ్మెల్యేల ట్రాక్టర్లను అసెంబ్లీ పరిసరాల్లో పోలీసులు అడ్డుకోవడంతో కాసేపు ఉద్రిక్త వాతావరణం నెలకొంది. ఈ సందర్భంగా బీజేపీ నేతలు పొరుగు రాష్ట్రాలు ఫసల్ బీమా యోజనను సమర్థవంతంగా అమలు చేస్తూ రైతులను ఆదుకుంటుంటే తెలంగాణలో మాత్రం రాజకీయ ప్రయోజనాల కోసం కేంద్ర పథకాన్ని పక్కనబెడుతున్నారని మండిపడ్డారు. ఇన్సూరెన్స్ ప్రీమియం చెల్లించడంలో ప్రభుత్వ నిర్లక్ష్యం వల్ల ఏటా వేలాది మంది రైతులు పంటలు నష్టపోయి ఆర్థికంగా చితికిపోతున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. అధికారంలోకి వస్తే రైతులకు రూ.500 బోనస్, పంటల భరోసా ఇస్తామని హామీ ఇచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం, అధికారంలోకి వచ్చాక ఆ హామీలను గాలికొదిలేసిందని విమర్శించారు. కేవలం ప్రకటనలకే పరిమితం కాకుండా, ఫసల్ బీమా యోజనలో రాష్ట్ర వాటాను చెల్లించి తక్షణమే ప్రీమియం నోటిఫికేషన్ విడుదల చేయాలని డిమాండ్ చేశారు. రైతుల పంట నష్టపరిహారాన్ని నేరుగా వారి ఖాతాల్లోనే జమ చేయాలని, లేకపోతే రైతులతో కలిసి రాష్ట్రవ్యాప్త ఆందోళనలు చేపడతామని హెచ్చరించారు. రైతుల హక్కుల కోసం బీజేపీ పోరాటం కొనసాగిస్తుందని నాయకులు స్పష్టం చేశారు. ఫసల్ బీమా యోజన అమలే కాక రైతు రుణమాఫీ అరకొరగా అమలు చేయడంపై, రైతుబంధు జమ కాలేదనే అంశాలపై సభలో ప్రభుత్వాన్ని నిలదీస్తామని తెలిపారు. ట్రాక్టర్ల ర్యాలీతో అసెంబ్లీ పరిసర ప్రాంతాల్లో తీవ్ర ట్రాఫిక్ జామ్ ఏర్పడగా పోలీసులు నిరసనకారులను సర్దిచెప్పి పరిస్థితిని అదుపులోకి తెచ్చారు.

## సమగ్ర నివేదికలు సమర్పించాలి

హైదరాబాద్, సెప్టెంబర్ 11 :
అసెంబ్లీ వద్ద జరిగిన రెండు సంఘటనలకు సంబంధించి దాఖలైన ఫిర్యాదులపై నివేదికలు సమర్పించాలని చైర్మన్ డాక్టర్ జస్టిస్ షమీమ్ అఖ్తర్ నేతృత్వంలోని తెలంగాణ మానవ హక్కుల కమిషన్ (టీజీహెచఆర్‌సీ) డీజీపీకి ఉత్తర్వులు జారీ చేసింది. బీఆరఎస్ ఎమ్మెల్సీ తాతా మధుసూదన్ దళిత సామాజిక వర్గానికి చెందిన శాసనసభ స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్‌ను మీడియా సమక్షంలో అసభ్య పదజాలంతో దూషించారని జాతీయ మాల మహానాడు రాష్ట్ర అధ్యక్షుడు పిల్లి సుధాకర్, ఇతరులు ఆరోపించారు. అలాగే, దళితులు మాజీ ముఖ్యమంత్రి కె.చంద్రశేఖర్ రావుకు చెందిన ఎర్రవెల్లి ఫామ్‌హౌస్ ఎదుట నిరసన నిర్వహించిన సమయంలో బీఆరఎస్ నాయకురాలిగా పేర్కొన్న పావని గౌడ్, ఇతరులు పసుపు నీరు, పాలు చల్లి ఆ ప్రాంతాన్ని 'శుద్ధి' చేసినట్లు, దళిత నిరసనకారులను అవమానకర పదజాలంతో దూషించినట్లు ఆరోపించారు. బాధ్యులపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని ఫిర్యాదుదారులు కోరారు. అలాగే శాసనసభ ప్రాంగణంలో జరిగిన నిరసన కార్యక్రమంలో కొంతమంది బీఆరఎస్ ఎమ్మెల్యేలు నల్ల టీ షర్టులు తొలగించి మహిళా పోలీసు సిబ్బంది సమక్షంలో అర్ధనగ్నంగా నిలబడినట్లు ఇందిరా శోభన్ ఫిర్యాదు చేశారు. ఈ ప్రవర్తన మహిళా పోలీసు సిబ్బందికి ఇబ్బంది, మానసిక వేదన, అవమానాన్ని కలిగించడంతోపాటు వారి గౌరవం, భద్రతపై ప్రభావం చూపిందని ఫిర్యాదులో పేర్కొన్నారు. సీసీటీవీ, ఇతర వీడియో దృశ్యాలను పరిశీలించి బాధ్యులను గుర్తించి తగిన చర్యలు తీసుకోవాలని కోరారు. రికార్డులో ఉన్న అంశాలను పరిశీలించిన అనంతరం రెండు కేసుల్లోనూ డీజీపీ నుంచి నివేదికలు కోరుతూ చైర్‌పర్సన్ ఆదేశాలు జారీ చేశారు. రెండు కేసులను వచ్చే నెల 9కు వాయిదా వేశారు.




# స్తంభించిన జెన్‌కో!

- ఇచ్చిన హామీని తుంగలో తొక్కిన జెన్‌కో యాజమాన్యం
- పెద్ద సారు మెప్పు కోసమే టెండర్ డ్రామాలంటూ ధ్వజం
- విద్యుత్ సౌధలో పెను దుమారం రేపిన 'సిరి న్యూస్' కథనాలు
- టెండర్ రద్దు చేయకుంటే సమ్మె తప్పదంటూ అల్టిమేటం



మొదటిపేజీ తరువాయి
ఆమోదానికి పంపడం పచ్చి ద్రోహమని మండిపడ్డారు. విద్యుత్ సంస్థల ప్రయోజనాలను గాలికొదిలేసి కేవలం కాంట్రాక్టర్ల జేబులు నింపేందుకే అధికారులు అత్యుత్సాహం ప్రదర్శిస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు.

### రూ.80 కోట్ల దుబారాపై ఎందుకంత తొందర?

ఒక్క టెండర్ వల్ల సంస్థకు ఏకంగా రూ.80 కోట్ల మేర అదనపు భారం పడుతుందని పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా నిరూపించినా యాజమాన్యం ఎందుకు పట్టించుకోలేదని ఉద్యోగ సంఘాలు సూటిగా ప్రశ్నిస్తున్నాయి. సాధారణంగా ఏ ప్రభుత్వ రంగ సంస్థ అయినా ఖర్చులను తగ్గించుకుని లాభాల బాట పట్టేందుకు ప్రయత్నిస్తుంది. కానీ ఇక్కడ జెన్‌కో ఉద్యోగులే స్వయంగా తక్కువ ఖర్చుతో నాణ్యంగా కోల్, యాష్ ప్లాంట్లను నిర్వహిస్తామని బతిమిలాడినా వినకుండా.. 10.5 శాతం ఎక్కువ రేట్లకు ప్రైవేటు సంస్థలకు కట్టబెట్టడంలో ఆంతర్యమేమిటని నిలదీస్తున్నారు.

### హాట్ టాపిక్‌గా సిరి న్యూస్ కథనాలు

సంస్థ నష్టాల ఊబిలోకి వెళ్లినా సరే, తమ జేబులు నిండితే చాలన్న స్వార్థంతోనే కొందరు ఉన్నతాధికారులు లాలూచీ పడ్డారని తీవ్ర ఆరోపణలు చేశారు. ఈ దోపిడీని వెలుగులోకి తెస్తూ 'సిరి న్యూస్' ప్రచురించిన పరిశోధనాత్మక కథనాలు విద్యుత్ వర్గాల్లో హాట్ టాపిక్‌గా మారడమే కాకుండా, ధర్నా ప్రాంగణాల్లో ఉద్యోగుల మధ్య ప్రధాన చర్చనీయాంశమయ్యాయి.

### 'పెద్ద సారు' కనుసన్నల్లోనే టెండర్ల నాటకం

తెలంగాణ విద్యుత్ శాఖలో సర్వాధికారిగా చెలామణి అవుతూ, ప్రతి వివాదానికి కేంద్ర బిందువుగా మారిన ఓ సీనియర్ ఐఏఎస్ అధికారి (పెద్ద సారు) కనుసన్నల్లోనే ఈ మొత్తం టెండర్ల కుంభకోణం నడిచిందన్న ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. విద్యుత్ శాఖలో నిబంధనలతో నిమిత్తం లేకుండా తాను చెప్పిందే శాసనంగా వ్యవహరించే ఆ పవర్ ఫుల్ ఐఏఎస్ అధికారి మెప్పు కోసమే జెన్‌కోలోని ఓ డైరెక్టర్ తెరవెనుక చక్రం తిప్పి అంచనాలను అడ్డగోలుగా పెంచేశారని తెలుస్తోంది. గతంలో డిస్కమ్‌లలో ఉద్యోగుల సమ్మెకు దారితీసిన పరిస్థితుల వెనుక, ఇటీవల ట్రాన్స్‌కోలో ఉద్యోగుల భావ ప్రకటనా స్వేచ్ఛను హరిస్తూ విడుదలైన నిర్బంధపు ఉత్తర్వుల వెనుక కూడా ఈ ఉన్నతాధికారి వ్యూహాలే ఉన్నాయన్న ప్రచారం జరుగుతోంది. 'పెద్ద సారు' ఆదేశించడంతోనే జెన్‌కో డైరెక్టర్ కళ్లుమూసుకుని టెండర్లను ఖరారు చేశారని, ఈ ఏకపక్ష నిర్ణయం భవిష్యత్తులో తీవ్ర న్యాయపరమైన చిక్కులను తెచ్చిపెట్టడం ఖాయమని విద్యుత్ నిపుణులు హెచ్చరిస్తున్నారు.

### టెండర్ రద్దు చేయకుంటే ఉత్పత్తి బంద్..

వైటీపీఎస్ కోల్, యాష్ హ్యాండ్లింగ్ టెండర్లను ప్రభుత్వం తక్షణమే రద్దు చేయాలని, లేనిపక్షంలో పోరాటాన్ని మరింత ఉధృతం చేస్తామని ఉద్యోగ జేఏసీ తేల్చిచెప్పింది. సీఈల ఘెరావ్‌తో ప్రారంభమైన ఈ నిరసన త్వరలోనే పూర్తిస్థాయి సమ్మెగా రూపాంతరం చెందుతుందని హెచ్చరించారు. థర్మల్ పవర్ స్టేషన్లలో ఉత్పత్తిని నిలిపివేసైనా సరే ప్రభుత్వ రంగ సంస్థలను కాపాడుకుంటామని నాయకులు స్పష్టం చేశారు. ఇప్పటికైనా రాష్ట్ర ప్రభుత్వం తక్షణమే జోక్యం చేసుకుని పెద్ద సారు మెప్పు కోసం జరిగిన ఈ వివాదాస్పద టెండర్లపై నిష్పాక్షిక విచారణ జరిపించి, టెండర్లను వెంటనే రద్దు చేయాలని విద్యుత్ ఉద్యోగ లోకం డిమాండ్ చేస్తోంది.

### కేటీపీఎస్‌లో మిన్నంటిన నిరసన జ్వాలలు.. సీఈల ముట్టడి

పాల్వంచలోని కొత్తగూడెం థర్మల్ పవర్ స్టేషన్ 7వ దశ ఎస్టీజీ సీఈ కార్యాలయం ఎదుట ఇంజనీర్లు, కార్మికులు భారీ ఎత్తున బైఠాయించి మెరుపు సమ్మె చేపట్టారు. కార్యాలయం ప్రధాన గేట్లను మూసివేసి యాజమాన్య తీరుకు వ్యతిరేకంగా హోరెత్తేలా నినాదాలు చేశారు. ఈ నిరసనలో కేటీపీఎస్ ఉద్యోగ సంఘాల నాయకులు రాజేందర్, బ్రహ్మాజీ, మహేష్, రాధాకృష్ణ, గిరిధర్, కోటేశ్వర్ రావు, రాజేష్, నవీన్, సంపత్, శ్రీనిధి, లక్ష్మి, శ్రీధర్, సయ్యద్ తదితరులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. వైటీపీఎస్ టెండర్లలో ప్రైవేటు వ్యక్తుల భాగస్వామ్యాన్ని ఎట్టిపరిస్థితుల్లోనూ అంగీకరించబోమని, గత సమావేశాల్లో తీసుకున్న ఏకాభిప్రాయ నిర్ణయాలను ప్రభుత్వం వెంటనే అమలు చేయాలని వారు గట్టిగా డిమాండ్ చేశారు.

### నాగార్జునసాగర్ సీఈ కార్యాలయం ముట్టడి

యాదాద్రి థర్మల్ పవర్ స్టేషన్ ప్రైవేటీకరణను తక్షణమే నిలిపివేయాలని, విద్యుత్ సంస్థల ఉద్యోగుల దీర్ఘకాలిక వేతన సవరణ కోసం పీఆర్సీ కమిటీని వెంటనే ఏర్పాటు చేయాలని డిమాండ్ చేస్తూ టీజీపీఈ జేఏసీ ఆధ్వర్యంలో నాగార్జునసాగర్ సీఈ, ఎన్ఎస్‌హెచ్ఈఎస్ కార్యాలయాన్ని ముట్టడించారు. ఈ కార్యక్రమంలో టీజీపీఈ జేఏసీ నాయకులు, వివిధ విద్యుత్ ఉద్యోగ సంఘాల ప్రతినిధులు, సిబ్బంది పెద్ద సంఖ్యలో పాల్గొని ప్రభుత్వ విధానాలకు వ్యతిరేకంగా తమ నిరసనను గళమెత్తారు. వైటీపీఎస్ ప్రైవేటీకరణ నిర్ణయాన్ని ప్రభుత్వం వెనక్కి తీసుకోవాలని, ఉద్యోగుల పీఆర్సీ సమస్యను ఎలాంటి జాప్యం లేకుండా పరిష్కరించాలని నాయకులు డిమాండ్ చేశారు. ఉద్యోగుల న్యాయమైన డిమాండ్లను తక్షణమే పరిష్కరించకపోతే రాష్ట్రవ్యాప్తంగా మరింత విస్తృతమైన, తీవ్రమైన ఆందోళనలు చేపడతామని ప్రభుత్వానికి హెచ్చరిక జారీ చేశారు.





# మళ్లీ పవర్ హాలిడే ముప్పు!

- గ్రేటర్‌లో ఓవర్‌లోడ్ అవుతున్న సబ్‌స్టేషన్లు, ఫీడర్లు
- ముందస్తు ప్రణాళికలు లేక చతికిలపడుతున్న ట్రాన్స్‌కో గ్రిడ్
- ఉచిత హామీలతో మరింత పెరిగిన విచ్చలవిడి వినియోగం

మొదటిపేజీ తరువాయి
రికార్డు స్థాయి డిమాండ్ ఎల్‌నినో ప్రభావంతో రుతుపవనాలు మొహం చాటేయడంతో రాష్ట్రంలో కీలకమైన జలవిద్యుత్ (హైడల్) ఉత్పత్తి దాదాపుగా పడకేసింది. నాగార్జునసాగర్, శ్రీరాంసాగర్ ప్రాజెక్టుల్లోకి ఆశించిన స్థాయిలో వరద నీరు చేరలేదు. శ్రీశైలంలో స్వల్పంగా నీరు చేరినా విద్యుత్ ఉత్పత్తికి సరిపడా నిల్వలు లేకపోవడం విద్యుత్ సంస్థలకు పెద్ద దెబ్బగా మారింది. వర్షాకాలంలో అత్యంత చౌకగా లభించే హైడల్ పవర్ గల్లంతు కావడంతో వ్యవస్థలపై ఒత్తిడి పెరిగింది. మరోవైపు వర్షాలు లేకపోవడంతో రైతులు పూర్తిగా బోరుబావుల పైనే ఆధారపడటంతో వ్యవసాయ రంగంలో విద్యుత్ డిమాండ్ అమాంతం పెరిగింది. హైదరాబాద్ నగరంలో ఎండల తీవ్రత, పరిశ్రమలు, వాణిజ్య సముదాయాలు, ఏసీల వినియోగం పెరిగి.. సెప్టెంబర్ నెలలోనే ఏకంగా 19,543 మెగావాట్ల ఆల్‌టైమ్ రికార్డు స్థాయి డిమాండ్ నమోదైంది

### రూ.10 పెట్టి యూనిట్ కొనుగోలు

రాష్ట్రంలో విద్యుత్ వినియోగం పెరుగుతున్నా, సొంత ఉత్పత్తి సామర్థ్యం మాత్రం దానికి తగ్గట్టుగా విస్తరించడం లేదు. టీజీ ట్రాన్స్‌కో అధికారిక గణాంకాల ప్రకారం.. 202425లో లభించిన థర్మల్ విద్యుత్ 22,356 ఎంయూ, హైడల్ విద్యుత్ 5,250 ఎంయూ కాగా, బయటి వనరుల నుంచి కొనుగోలు చేసిన విద్యుత్ ఏకంగా 61,467 ఎంయూలుగా నమోదైంది. అంటే రాష్ట్రంలో సొంత విద్యుత్ ఉత్పత్తి కంటే మార్కెట్ కొనుగోళ్లే దాదాపు మూడు రెట్లు అధికంగా ఉన్నాయి. 2025 26 సెప్టెంబర్ నాటికి కూడా ఉత్పత్తి 16 వేల ఎంయూ దాటకపోగా, ఇతర వనరుల కొనుగోళ్లు 25,388 ఎంయూలకు చేరాయి. పీక్ డిమాండ్ సమయంలో పవర్ ఎక్స్ఛేంజీల నుంచి యూనిట్‌కు ఏకంగా రూ.10 వరకు అత్యధిక ధర చెల్లించి సర్కారు తాత్కాలికంగా నెట్టుకొస్తోంది. దీర్ఘకాలిక ఒప్పందాలు చేసుకోకుండా ఇలా ఖజానాపై వేల కోట్ల భారాన్ని మోపడంపై నిపుణులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

### ఓవర్‌లోడ్ అవుతున్న సబ్‌స్టేషన్లు..

రాష్ట్రంలో పీక్ డిమాండ్ 20 వేల మెగావాట్లకు చేరువవుతున్న తరుణంలో, ఉత్పత్తి అయిన విద్యుత్‌ను సురక్షితంగా రవాణా చేయాల్సిన ట్రాన్స్‌కో నెట్‌వర్క్ ఒత్తిడికి తట్టుకోలేక చతికిలపడుతోంది. గత రెండేళ్లుగా కొత్తగా 132/220/400 కేవీ సబ్‌స్టేషన్ల నిర్మాణాలు పూర్తికాకపోవడంతో ఉన్న పాత లైన్లపైనే అధిక భారం పడుతోంది. ప్రత్యేకించి గ్రేటర్ హైదరాబాద్ పరిధిలోని పీఆర్వో, ఓవర్ లోడెడ్ ఫీడర్లు, ట్రాన్స్‌ఫార్మర్లు తరచూ ట్రిప్పింగ్‌లకు గురవుతున్నాయి. గ్రిడ్‌లో ఏదైనా ఒక కీలక కారిడార్‌లో సాంకేతిక సమస్య తలెత్తితే అది చైన్ రియాక్షన్‌లా మారి రాష్ట్రవ్యాప్త బ్లాక్‌అవుట్‌కు దారితీసే ప్రమాదముంది. ఈ లోపాలను కప్పిపుచ్చుకునేందుకు డిస్కమ్‌లు వినియోగదారులను 'విద్యుత్ పొదుపు' పాటించాలంటూ ప్రచారాలు మొదలుపెట్టడం విద్యుత్ శాఖ డొల్లతనానికి అద్దం పడుతోంది.

### ఉచిత హామీల మాయాజాలం..

ప్రభుత్వం సరైన ముందస్తు అధ్యయనం లేకుండా అమలు చేస్తున్న 200 యూనిట్ల లోపు గృహజ్యోతి పథకం, చిరు వ్యాపారులకు, పండుగలకు ఇచ్చిన ఉచిత హామీలతో విద్యుత్ వాడకం విపరీతంగా పెరిగిపోయింది. నియంత్రణ లేని సరఫరా విధానాలతో గ్రిడ్ అదుపు తప్పుతోంది. ఫలితంగా నగరాల్లో లోడ్ షెడ్డింగ్ పేరిట అప్రకటిత కోతలు విధిస్తుండగా, గ్రామాల్లో వ్యవసాయానికి 7 గంటలు కూడా సరిగ్గా త్రీ ఫేజ్ కరెంట్ ఇవ్వలేని పరిస్థితి ఏర్పడింది. పరిస్థితులు ఇలాగే కొనసాగితే పరిశ్రమలకు గతంలో మాదిరిగానే మళ్లీ వారానికి రెండు రోజుల 'పవర్ హాలిడే'లు ప్రకటించాల్సి వస్తుందని పారిశ్రామిక వర్గాలు భయాందోళన చెందుతున్నాయి.

### ప్రభుత్వం ముందున్న అసలు ప్రశ్నలు ఇవే

1. గరిష్ఠ డిమాండ్ 20 వేల మెగావాట్లు దాటితే తక్షణమే గ్రిడ్‌కు అందించే అందుబాటులోని విద్యుత్ సామర్థ్యం ఎంత?
2. ఎల్‌నినో ప్రభావంతో హైడల్ ఉత్పత్తి పడిపోతే ఆ లోటును అధిగమించేందుకు ప్రత్యామ్నాయ ప్రణాళికలు ఏవి?
3. ఎక్స్‌చేంజ్‌లో యూనిట్‌కు రూ.10 చొప్పున వేల కోట్లు ధారబోయడం తప్ప దీర్ఘకాలిక ఒప్పందాలపై దృష్టి ఎందుకు పెట్టలేదు?
4. గ్రేటర్ హైదరాబాద్‌లో ఓవర్‌లోడ్ అవుతున్న సబ్‌స్టేషన్లు, ఫీడర్ల ఆధునీకరణను ఎందుకు విస్మరించారు?
5. గత రెండేళ్లుగా ప్రసార సామర్థ్యాన్ని పెంచకుండా కాగితాలపైనే లెక్కలు ఎందుకు చూపుతున్నారు? ఈ ప్రశ్నలపై ప్రభుత్వం ఇప్పటికైనా తక్షణమే ఉన్నత స్థాయి అత్యవసర సమీక్ష నిర్వహించకపోతే, రాబోయే రోజుల్లో యావత్ తెలంగాణ తీవ్ర అంధకారంలోకి కూరుకుపోవడం ఖాయంగా కనిపిస్తోంది.

# అటవీ శాఖ అమరుల సేవలు చిరస్మరణీయం

హైదరాబాద్, సెప్టెంబర్ 11 :
సహజ వనరులు, అటవీ సంపద, వన్యప్రాణుల పరిరక్షణలో ప్రాణత్యాగం చేసిన అటవీ శాఖ సిబ్బంది సేవలు చిరస్మరణీయమని డీజీపీ¾ సి.వి.ఆనంద్ అన్నారు. అటవీ శాఖ పోలీసు అమరవీరుల దినోత్సవం సందర్భంగా నెహ్రూ జూలాజికల్ పార్కులో శుక్రవారం నిర్వహించిన కార్యక్రమంలో ఆయన పాల్గొని అమరవీరులకు నివాళులర్పించారు. పర్యాటక, ఎక్సయిజ్ శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు మాట్లాడుతూ విధి నిర్వహణలో ప్రాణాలు కోల్పోయిన అటవీ సిబ్బంది కుటుంబాలకు ప్రభుత్వం అండగా ఉంటుందని, అన్ని విధాలా ఆదుకుంటామని తెలిపారు. అక్రమ కలప రవాణా, వన్యప్రాణుల వేటను అడ్డుకునే క్రమంలో ప్రాణాలకు ముప్పు ఉందన్నారు. అటవీ సిబ్బంది ఆయుధాలు ఇవ్వాలని కోరారు. ఎక్సైజ్ శాఖ తరఫున డ్రగ్స్ నియంత్రణకు ప్రభుత్వం కఠిన చర్యలు తీసుకుంటోందని జూపల్లి తెలిపారు. మాదకద్రవ్యాల అక్రమ రవాణా, వినియోగానికి పాల్పడుతున్న వారిపై చట్ట ప్రకారం కేసులు నమోదు చేస్తున్నామని, అవసరమైన సందర్భాల్లో పీడీ యాక్ట్ కింద చర్యలు తీసుకుంటున్నామని చెప్పారు. అడవుల నరికివేత, అటవీ విస్తీర్ణం తగ్గిపోవడం గ్లోబల్ వార్మింగ్‌కు ప్రధాన కారణాల్లో ఒకటని మంత్రి పేర్కొన్నారు. కవ్వాల్, అమ్రాబాద్ టైగర్ రిజర్వ్ ఫారెస్టులను పర్యాటకంగా ప్రభుత్వం అభివృద్ధి చేసిందన్నారు.

**23మంది అటవీ సిబ్బంది ప్రాణత్యాగం : డీజీపీ**

రాజస్థాన్‌లోని ఖేజర్లీ ప్రాంతంలో చెట్లను, పర్యావరణాన్ని కాపాడేందుకు 1730 సంవత్సరంలో 363మంది బిష్ణోయి తెగ ప్రజలు ప్రాణత్యాగం చేసిన ఘటనకు గుర్తుగా యేటా సెప్టెంబర్ 11న అటవీ అమరవీరుల దినోత్సవాన్ని నిర్వహిస్తున్నట్లు డీజీపీ¾ తెలిపారు. ఈ రోజు ప్రత్యేకమని, ఇది భావోద్వేగంతో కూడిన రోజని అన్నారు. వన్యప్రాణులు, అడవుల సంరక్షణలో 23మంది అటవీశాఖ సిబ్బంది ప్రాణాలు కోల్పోయారని డీజీపీ తెలిపారు. ఈ ఏడాది ఆగస్టు 11న పాల్వంచలో ఎఫ్‌బీవో బానోతు నవీన్ వన్యప్రాణుల కోసం ఏర్పాటు
చేసిన ఉచ్చులో చిక్కుకుని అటవీ, వన్య ప్రాణుల పరిరక్షణలో ప్రాణ త్యాగం చేశారంటూ ఆయన కుటుంబానికి ప్రగాఢ సానుభూతి తెలిపారు. అటవీ శాఖతో తనకు ఉన్న అనుబంధాన్ని డీజీపీ గుర్తు చేసుకున్నారు. తన తండ్రి 1953లో అటవీ శాఖలో రేంజ్ ఆఫీసర్‌గా చేరి 35 ఏళ్లపాటు సేవలందించి 1988లో డీఎఫ్‌వోగా పదవీ విరమణ చేశారని తెలిపారు. నక్సల్స్ ప్రభావం ఉన్న రోజుల్లో తన తండ్రి అటవీ శాఖలో పనిచేసేవారని, దీంతో ఫారెస్ట్ సిబ్బందితో అనుబంధం ఉందని చెప్పారు.

# విద్యా రంగంలో సంస్కరణల హోరు

మొదటిపేజీ తరువాయి

రేవంత్ తెలిపారు.

**55 రోజుల్లోనే 10,006 టీచర్ పోస్టుల భర్తీ**

తాము అధికారంలోకి వచ్చిన మొదటి ఏడాదిలోనే కేవలం 55 రోజుల్లోనే మెగా డీఎస్సీ ద్వారా ఎలాంటి వివాదాలు, ఆరోపణలు లేకుండా 10,006 ఉపాధ్యాయ ఉద్యోగాలను భర్తీ చేశామని సీఎం చెప్పారు. పదేళ్లలో గత ప్రభుత్వం 7,857 మంది టీచర్లను మాత్రమే నియమించిందన్నారు. ఉపాధ్యాయుల బదిలీలు, ప్రమోషన్ల ప్రక్రియను కూడా పారదర్శకంగా పూర్తి చేశామన్నారు.

**పరిశ్రమల అవసరాలకు తగ్గట్టు నూతన వర్సిటీలు & కోర్సులు**

యువతను 'రెడీ టూ వర్క్‌ఫోర్స్'గా మార్చేందుకు ప్రత్యేక యంగ్ ఇండియా స్కిల్స్ యూనివర్సిటీ, క్రీడల ప్రోత్సాహానికి 'స్పోర్ట్స్ యూనివర్సిటీ'ని ప్రారంభించాం. డిగ్రీ, ఇంజినీరింగ్ స్థాయిల్లో బ్యాంకింగ్, ఫైనాన్షియల్ సర్వీసెస్ కోర్సులను దేశంలోనే తొలిసారిగా ప్రవేశపెట్టామని ముఖ్యమంత్రి చెప్పారు. రూ.21,000 కోట్లతో 105 'యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ స్కూల్స్', 104 'తెలంగాణ పబ్లిక్ స్కూల్స్' నిర్మాణం చేపడుతున్నాం. కోఠి ఉమెన్స్ కాలేజీని వీరనారి చాకలి ఐలమ్మ మహిళా యూనివర్సిటీగా మార్చి రూ.500 కోట్లు కేటాయించామని చెప్పారు. టీసీఎస్ భాగస్వామ్యంతో 65 ఐటీఐలను అడ్వాన్స్‌డ్ ట్రేడ్ సెంటర్లుగా తీర్చిదిద్దాం.. విద్యారంగంలో సమగ్ర మార్పులు తీసుకొచ్చేందుకు విద్యా కమిషన్ నివేదికపై కేశవరావు (కేకే) నేతృత్వంలోని కమిటీ పరిశీలన చేస్తోందని, ప్రతిపక్ష సభ్యుల సానుకూల సూచనలను స్వీకరించేందుకు ప్రభుత్వం సిద్ధంగా ఉందని సీఎం రేవంత్ రెడ్డి స్పష్టం చేశారు.

**విద్య, వైద్యానికి అత్యంత ప్రాధాన్యం : మంత్రి దుద్దిళ్ల**

తమ ప్రభుత్వం ఆరు గ్యారంటీల అమలుతోపాటు విద్య, వైద్యానికి అత్యంత ప్రాధాన్యం ఇస్తోందని, రెండున్నరేళ్ల వ్యవధిలో విద్యా వ్యవస్థలో అనేక సంస్కరణలకు శ్రీకారం చుట్టామని ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి విద్యపై శాసనసభలో జరిగిన చర్చలో తెలిపారు. ప్రభుత్వపరంగా ప్రీ ప్రైమరీ సెక్షన్లను కూడా ప్రారంభించామన్నారు. చాలా ఏళ్ల తర్వాత అకడమిక్ కరిక్యులంలో మార్పులు చేర్పులు చేశామన్నారు. చదువుకుంటూనే విద్యార్థులు సంపాదించేలా ప్రముఖ కంపెనీల్లో ఇంటర్న్‌షిప్ అవకాశాలను కల్పించే ఏర్పాట్లు చేశామన్నారు.. బీఎఫఎసఐ(బ్యాంకింగ్, ఫైనాన్షియల్ సర్వీసెస్, ఇన్సూరెన్స్) కన్సార్టియం సహకారంతో దేశంలోనే తొలిసారిగా డిగ్రీ, ఇంజినీరింగ్‌లో కోర్సులకు శ్రీకారం చుట్టామని, మనల్ని చూసి బీఎఫఎసఐ తరహా కోర్సులను కర్ణాటక, తమిళనాడు లాంటి అనేక రాష్ట్రాల్లో ప్రారంభించారని ఆయన చెప్పారు. టీ హబ్ తరహాలోనే వరంగల్‌లో ఇంక్యుబేషన్ హబ్‌ను(కెహబ్) ప్రారంభించేందుకు ఏర్పాట్లు చేస్తున్నామని చెప్పారు. రాష్ట్రంలోని అన్ని ప్రభుత్వ యూనివర్సిటీల్లోనూ ఈ తరహా ఇంక్యుబేషన్ హబ్‌లను ఏర్పాటు చేసేందుకు ప్రణాళికలు రూపొందిస్తున్నామని, వివిధ దేశాల్లో విజయవంతంగా అమలవుతున్న విద్యా సంస్కరణలను పరిశీలించేందుకు ప్రభుత్వ ఉపాధ్యాయులు, అధ్యాపకులను అక్కడికి పంపించామని మంత్రి శ్రీధర్‌బాబు తెలిపారు. అన్ని విద్యా సంస్థలను డ్రగ్ ఫ్రీ క్యాంపస్ లుగా తీర్చిదిద్దాలన్నదే ప్రభుత్వ సంకల్పమన్నారు. ప్రభుత్వం బాలికల విద్యపై ప్రత్యేక దృష్టి సారించిందని, రూ.500 కోట్లతో 93 కేజీబీవీలను ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఎక్సలెన్స్‌గా అభివృద్ధి చేసే ప్రక్రియను ప్రారంభించామని వివరించారు. విద్యా వ్యవస్థను మరింత ముందుకు తీసుకెళ్లేలా అందరి సలహాలు, సూచనలను స్వీకరించి అమలు చేసేందుకు ప్రభుత్వం సిద్ధంగా ఉందని, ఇందులో ఎలాంటి భేషజాలు లేవని మంత్రి చెప్పారు.

**ప్రభుత్వ బడుల్లో ప్రీ-ప్రైమరీ విద్య ప్రారంభం**

ప్రైవేట్ పాఠశాలలకు దీటుగా తొలిసారిగా ప్రభుత్వ బడుల్లో నర్సరీ, ఎల్‌కేజీ (ప్రీ-ప్రైమరీ) సెక్షన్లను అందుబాటులోకి తెచ్చాం. ఈ ఏడాది 64 వేల మంది విద్యార్థులు ప్రీ-ప్రైమరీలో చేరారు.ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల ఎన్‌రోల్‌మెంట్ 27 శాతం పెరిగి, కొత్తగా 86 వేల మంది విద్యార్థులు చేరారు. ప్రీ-ప్రైమరీ నుంచి 12వ తరగతి వరకు విద్యార్థులతోపాటు పాఠశాలల బోధన, బోధనేతర సిబ్బందికి కూడా ఉచిత మధ్యాహ్న భోజన పథకాన్ని విస్తరించాం.

# మత్స్యకారుల బతుకులకు భరోసా

**హైదరాబాద్, సెప్టెంబర్ 11:**

చెరువుల పూర్తి నీటిమట్టం—ఫుల్ ట్యాంక్ లెవల్ (ఎఫ్‌టీఎల్) హద్దులను ఎట్టి పరిస్థితుల్లోనూ కాపాడుతామని, జలవనరుల ఆక్రమణలను ఉపేక్షించబోమని ఆయన శాసన మండలి వేదికగా రాష్ట్ర నీటిపారుదల, పౌర సరఫరాల శాఖ మంత్రి కెప్టెన్ ఎన్.ఉత్తమ్ కుమార్ రెడ్డి స్పష్టం చేశారు. చెరువు నిండితే పల్లె పచ్చబడుతుందని, మత్స్యకారుడి వల నిండితే అతని కుటుంబంలో వెలుగులు విరుస్తాయని, అందుకే చెరువులు, కుంటలు, ఇతర జలవనరుల పరిరక్షణతోపాటు వాటిపై ఆధారపడి జీవిస్తున్న మత్స్యకారుల జీవనోపాధిని కాపాడటాన్ని ప్రభుత్వం అత్యంత ప్రాధాన్య అంశంగా భావిస్తోందన్నారు. శుక్రవారం శాసన మండలిలో జరిగిన చర్చ సందర్భంగా సభ్యులు లేవనెత్తిన అంశాలకు మంత్రి సమాధానమిచ్చారు. చెరువుల ఎఫ్‌టీఎల్ హద్దులు దెబ్బతిన్నా, జలవనరులు ఆక్రమణలకు గురైనా, వాటిపై ఆధారపడి జీవించే మత్స్యకార కుటుంబాలకు నష్టం వాటిల్లినా ప్రభుత్వం తీవ్రంగా పరిగణిస్తుందని చెప్పారు. సభ దృష్టికి తీసుకొచ్చిన నిర్దిష్ట సమస్యను నీటిపారుదల శాఖ అధికారులు స్వయంగా క్షేత్రస్థాయిలో పరిశీలించాలని మంత్రి ఆదేశించారు. వారం రోజుల్లోగా సంబంధిత చెరువును సందర్శించి, జలవనరుల పరిరక్షణకు చేపట్టాల్సిన చర్యలు, స్థానిక మత్స్యకారుల సమస్యల పరిష్కారానికి అవసరమైన కార్యాచరణపై నివేదిక సమర్పించాలని స్పష్టం చేశారు.రాష్ట్రం ఏర్పడిన సమయంలో సుమారు 2,150గా ఉన్న మత్స్య సహకార సంఘాల సంఖ్య ప్రస్తుతం ఆరు వేలకు పైగా పెరిగిందని సభ్యులు సభ దృష్టికి తీసుకొచ్చారు. అదేవిధంగా సంఘాల సభ్యత్వం సుమారు రెండు లక్షల నుంచి 6.5 లక్షలకు చేరిందని వివరించారు. చెరువులు, ఇతర జలవనరుల పరిరక్షణలో మత్స్య సహకార సంఘాలకు మరింత క్రియాశీలమైన పాత్ర కల్పిస్తూ సమగ్ర విధానాన్ని రూపొందించాలని సభ్యులు కోరారు. రాష్ట్రంలోని అన్ని చెరువులకు పరిరక్షణ, నిర్వహణ కమిటీలను ఏర్పాటు చేసే ప్రక్రియను ప్రభుత్వం ఇప్పటికే ప్రారంభించిందని మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి వెల్లడించారు. జలవనరుల సమర్థ నిర్వహణ, నిరంతర పర్యవేక్షణ, ఆక్రమణల నిరోధానికి కమిటీల వ్యవస్థను పునరుద్ధరించాలని వచ్చిన సిఫారసుల మేరకు ప్రభుత్వం ఈ చర్యలు చేపట్టిందన్నారు.రాష్ట్రవ్యాప్తంగా ఇప్పటికే సుమారు 44 వేల చెరువులకు జియో ట్యాగింగ్ పూర్తయిందని మంత్రి తెలిపారు. చెరువుల పరిరక్షణకు అదనపు నిధులు అవసరమైతే వాటిని సమకూర్చేందుకు ప్రభుత్వం వెనుకాడబోదని స్పష్టం చేశారు. నల్లగొండ జిల్లాలోని నెల్లికల్ ఎత్తిపోతల పథకాన్ని డిసెంబర్ 2027 నాటికి సంపూర్ణంగా పూర్తి చేసి, సుమారు 24 వేల ఎకరాల ఆయకట్టుకు సాగునీరు అందిస్తామని మంత్రి మండలి సాక్షిగా విస్పష్టమైన హామీ ఇచ్చారు. నెల్లికల్ ఎత్తిపోతల పథకాన్ని ప్రభుత్వం అత్యంత ప్రాధాన్య ప్రాజెక్టుగా గుర్తించిందని చెప్పారు. పనుల పురోగతిని నిరంతరం పర్యవేక్షిస్తూ, నిర్దేశించుకున్న గడువులోగా రెండు దశలను పూర్తి చేసేందుకు చర్యలు చేపట్టామని వివరించారు. తొలి దశలో జూన్ 2027 నాటికి 7,800 ఎకరాలకు సాగునీరు అందిస్తామని, మిగిలిన సుమారు 16 వేల ఎకరాలకు డిసెంబర్ 2027 నాటికి నీరందించి మొత్తం 24 వేల ఎకరాల ఆయకట్టును సస్యశ్యామలం చేస్తామన్నారుప్రజా పంపిణీ వ్యవస్థ ద్వారా ప్రస్తుతం అందిస్తున్న బియ్యం, గోధుమలు, చక్కెరతోపాటు మరికొన్ని నిత్యావసర సరుకులను పంపిణీ చేసే ప్రతిపాదనను ప్రభుత్వం సానుకూలంగా పరిశీలిస్తోందన్నారు.శాసన మండలి ప్రశ్నోత్తరాల సమయంలో ప్రొఫెసర్ ఎం.కోదండరామ్‌తోపాటు పలువురు సభ్యులు చేసిన సూచనలపై మంత్రి స్పందించారు. పీడీఎస్ పరిధిలోకి అదనపు సరుకులను తీసుకురావడం ప్రభుత్వ విధానపరమైన నిర్ణయమని, అందుకు అవసరమయ్యే ఆర్థిక భారాన్ని సమగ్రంగా అంచనా వేస్తున్నామని తెలిపారు.

# ఓబీసీలకు ప్రత్యేక గుర్తింపు కల్పించాలి

**హైదరాబాద్, సెప్టెంబర్ 11:**

ఓబీసీలకు సంబంధించిన ఈ అంశంపై సభలో ఏకగ్రీవ తీర్మానం చేయాల్సిన అవసరం ఉందని బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ అన్నారు. భవిష్యత్తు తరాలకు సంబంధించిన ఈ ముఖ్యమైన అంశంపై కేంద్ర ప్రభుత్వం తగిన చర్యలు తీసుకోవాల్సిన అవసరం వున్న నేపథ్యంలో భారత జాతీయ కాంగ్రెస్ పార్టీ తరఫున ఈ తీర్మానాన్ని సభలో ప్రవేశపెడుతున్నామ న్నారు. కేంద్రంలో అధికారంలో ఉన్న పార్టీకి చెందిన సభ్యులు కూడా బీసీల సమస్యలపై శాసనసభ ఏకగ్రీవంగా తీసుకునే నిర్ణయానికి మద్దతు ఇవ్వాలని కోరారు. దేశవ్యాప్తంగా ఓబీసీల జనాభా గణాంకాలు కచ్చితంగా ఉండాల్సిన అవసరం ఉంది. కుల ఆధారిత జన గణన ఎందుకు అవసరమో అందరూ అర్థం చేసు కోవాలి. బీసీల సామాజిక న్యాయం, విద్యా అవ కాశాలు, ఉద్యోగాలు, రాజకీయ ప్రాతినిధ్యం కోసం కచ్చితమైన గణాంకాలు అవసరం. తెలంగాణ ప్రభుత్వం నిర్వహించిన సామాజిక,ఆర్థిక, విద్యా, ఉద్యోగ, రాజకీయ మరియు కుల సర్వే ద్వారా రాష్ట్రంలోని బీసీల వాస్తవ పరిస్థితిని గుర్తించే ప్రయత్నం చేసింది. ఆ సర్వే ఆధారంగా బీసీలకు విద్య, ఉద్యోగాల్లో రిజర్వేషన్లు కల్పించే దిశగా రాష్ట్ర ప్రభుత్వం చట్టపరమైన చర్యలు చేపట్టింది. కేంద్ర ప్రభుత్వం గతంలో నిర్వహించిన జనగణనలో ఓబీసీలకు స్పష్టమైన ప్రత్యేక గుర్తింపు ఇవ్వకుండా ఓపెన్ కాలమ్ విధానం పెట్టడం వల్ల కచ్చితమైన ఓబీసీ గణాంకాలు సేకరించడం కష్టమైంది. కులాల పేర్లు, వివరాలు స్పష్టంగా నమోదు చేయకపోవడం వల్ల ఓబీసీల వాస్తవ జనాభా, వారి అవసరాలను అంచనా వేయడంలో సమస్యలు ఏర్పడ్డాయి. తెలంగాణలో ముందుగానే కులాల జాబితాలను రూపొందించి సర్వే నిర్వహించడం వల్ల కచ్చితమైన గణాంకాలు సేకరించడం సాధ్యమైంది. కేకేంద్ర జనగ ణనలో ఓబీసీలకు ఎస్సీ, ఎస్టీల మాదిరిగా ప్రత్యేక గుర్తింపు కల్పించాలి. జనగణన షెడ్యూల్లో ఓబీసీల కోసం ప్రత్యేక కాలమ్ను ఏర్పాటు. చేయాలి. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల అధికారిక రికార్డుల్లో ఉన్న కులాల వివరాలను డిజిటల్ పోర్టల్లో నమోదు చేయాలి. కచ్చితమైన కుల గణాంకాల ఆధారంగా సంక్షేమ పథకాలు, విద్యా అవకాశాలు, ఉద్యోగాలు, రిజర్వేషన్లను సమర్థవంతంగా అమలు చేయాలి. దేశవ్యా ప్తంగా బీసీలకు న్యాయం జరిగేలా కుల గణనను శాస్త్రీయంగా, పారదర్శ కంగా నిర్వహించాలి. ఈ అంశాలన్నింటిపై శాసనసభ ఏకగ్రీ వంగా తీర్మానం చేసి కేంద్ర ప్రభుత్వానికి పంపాలి. కచ్చితమైన బీసీ గణాంకాలు ఉంటేనే సామాజిక న్యాయం కోసం సరైన విధానాలను రూపొందించడం సాధ్యమవుతుంది. సామాజిక, ఆర్థిక పరిస్థితులను దృష్టిలో ఉంచుకుని ప్రతి వర్గానికి న్యాయం జరిగేలా చర్యలు తీసుకోవా లిన అవసరం ఉంది.

# జనగణనలో కులగణనను చేర్చాలి

**హైదరాబాద్, సెప్టెంబర్ 11 :**

దేశంలో సామాజిక అసమానతలను తొలగించి బలహీనవర్గాలకు న్యాయం చేయాలంటే జనగణనలో కులగణనను తప్పనిసరిగా చేర్చాలని ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క స్పష్టం చేశారు. కులగణన చేద్దామా వద్దా అనే విషయాన్ని బీజేపీ సభ్యులు సూటిగా చెప్పాలని ఆయన డిమాండ్ చేశారు. తెలంగాణలో సర్వేను అసెంబ్లీలోనే అభినందించి ఇప్పుడు దేశంలో ఎక్కడా కులగణన జరగలేదని చెప్పడం సరైన విధానం కాదన్నారు. రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం నిర్వహించిన సామాజిక, ఆర్థిక, రాజకీయ సర్వేను దేశానికి ఆదర్శంగా తీసుకుని దేశవ్యాప్తంగా ఇలాంటి సమగ్ర సర్వే నిర్వహించాల్సిన అవసరం ఉందన్నారు. రాష్ట్ర అసెంబ్లీలో జనగణన, కులగణన అంశంపై శుక్రవారం జరిగిన చర్చలో ఆయన మాట్లాడుతూ కులగణన అనేది కులాలకు, రాజకీయ పార్టీలకు సంబంధించిన అంశం కాదని, సమాజ శ్రేయస్సుకు సంబంధించిన విషయమని పేర్కొన్నారు. జనగణన నిర్వహించే సమయంలోనే కులగణనను కూడా అందులో చేరుస్తామని అప్పట్లో కేంద్రం చెప్పిందని భట్టి గుర్తు చేశారు. అయితే ప్రస్తుతం జరుగుతున్న జనగణనలో కులగణనను చేర్చకపోవడం బాధాకరమన్నారు. ఇచ్చిన మాట ప్రకారం జనగణనలో కులగణనను చేర్చాలని డిమాండ్ చేశారు. కులగణన లేకుండా దేశంలోని బలహీనవర్గాల వాస్తవ పరిస్థితులను ఎలా గుర్తిస్తారని ప్రశ్నించారు. కుల గణనను చేర్చకుండా ప్రజలను పక్కదోవ పట్టించడం సరికాదన్నారు.

**రాష్ట్ర సర్వే దేశానికే ఆదర్శం**

రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత రాష్ట్రవ్యాప్తంగా సామాజిక, ఆర్థిక, రాజకీయ పరిస్థితులపై సమగ్ర సర్వే నిర్వహించిందని భట్టి తెలిపారు. రాష్ట్రంలో ఏ కులానికి ఎంత జనాభా ఉంది, వారి వృత్తులు ఏమిటి, ఆర్థిక పరిస్థితి ఎలా ఉంది, ఎంతమంది చదువుకున్నారు, ఎంతమంది ఉద్యోగాల్లో ఉన్నారు, ఎంతమంది నిరుద్యోగులు, భూమి ఉన్నవారు ఎంతమంది, లేనివారు ఎంతమంది వంటి అనేక అంశాలను కూలంకషంగా సేకరించామని చెప్పారు. ప్లానింగ్ శాఖను పర్యవేక్షిస్తున్న డిప్యూటీ సీఎంగా తాను ప్రతిరోజూ ఈ ప్రక్రియను సమీక్షిస్తూ ఎలాంటి పొరపాట్లకు తావు లేకుండా సర్వేను నిర్వహించామని తెలిపారు. ఈ సర్వే దేశానికే ఆదర్శంగా నిలిచిందన్నారు. సర్వే నివేదికను అసెంబ్లీలో ప్రవేశపెట్టినప్పుడు ప్రతిపక్ష సభ్యులు సైతం అభినందించారని గుర్తు చేశారు.

**దేశమంతా తెలంగాణ మోడల్ కావాలి**

తెలంగాణలో జరిగిన సర్వే తరహాలో దేశవ్యాప్తంగా కులగణన నిర్వహించాలని కాంగ్రెస్ పార్టీ మొదటి నుంచి డిమాండ్ చేస్తోందని భట్టి తెలిపారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఢిల్లీకి వెళ్లి పార్లమెంట్‌లోని వివిధ పార్టీల నాయకులతోపాటు ప్రధానమంత్రిని కూడా కలిసి దేశవ్యాప్తంగా కులగణన నిర్వహించాలని విజ్ఞప్తి చేశారని చెప్పారు. మంత్రులు కూడా ఈ అంశంపై కేంద్రంపై ఒత్తిడి తెచ్చారని వివరించారు. అయినప్పటికీ కేంద్రం నుంచి ఆశించిన విధంగా స్పందన రాకపోవడంతో ఢిల్లీలోని రాజకీయ పార్టీలను ఆహ్వానించి సమావేశం నిర్వహించి తెలంగాణలో అమలు చేసిన విధానాన్ని వివరించామని తెలిపారు. దేశవ్యాప్తంగా ఇదే తరహాలో కులగణన నిర్వహించాలని కోరామని చెప్పారు.

**కులగణన ఒక 'ఎక్స్‌రే'**

సమాజంలో ఆస్తులు, వనరులు అందరికీ సమానంగా అందడం లేదని భట్టి పేర్కొన్నారు. ఈ అసమానతలను తొలగించాలంటే ముందుగా సమస్య ఎక్కడ ఉందో తెలుసుకోవాల్సి ఉందన్నారు. 'సమాజం ఆరోగ్యంగా లేకపోతే ముందుగా ఎక్స్‌రే తీయాలి. వ్యాధిని నిర్ధారించాలి. ఆ తర్వాతే చికిత్స చేయాలి. సమాజంలో ఉన్న అసమానతలను గుర్తించే ఎక్స్‌రేనే కులగణన' అని భట్టి అభివర్ణించారు. కులగణన ద్వారా వివిధ సామాజిక వర్గాల వాస్తవ జనాభా, వారి సామాజిక, ఆర్థిక పరిస్థితులు స్పష్టంగా తెలుస్తాయని, ఆ సమాచారం ఆధారంగా సంక్షేమ, అభివృద్ధి విధానాలను రూపొందించవచ్చని అన్నారు. జనాభా ప్రాతిపదికన అవకాశాలు, వనరులు, అభివృద్ధి ఫలాలు అందరికీ సమానంగా చేరేలా చర్యలు తీసుకోవచ్చన్నారు. దేశంలో రాబోయే ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వస్తుందని, రాహుల్ గాంధీ ప్రధానమంత్రి అవుతారని భట్టి విక్రమార్క ధీమా వ్యక్తం చేశారు. రాష్ట్రంలో నిర్వహించిన తరహాలో రాహుల్ గాంధీ నాయకత్వంలో దేశవ్యాప్తంగా సామాజిక, ఆర్థిక, రాజకీయ సర్వే నిర్వహిస్తామని ప్రకటించారు. కాగా, జన గణన 2027 రెండో దశ ప్రశ్నావళిలో బీసీ/ఓబీసీలను చేర్చాలనీ శాసన సభ ఏకగ్రీవ తీర్మానం చేసింది.

## ఆయుధాల చోరీ కేసులో
# నలుగురి అరెస్ట్

- కేసు ఛేదించిన పోలీసులు, మిలిటరీ అధికారులు

**హైదరాబాద్, సెప్టెంబర్ 11:**

హైదరాబాద్‌లోని బొల్లారంలో ఉన్న మద్రాస్ రెజిమెంట్ బెల్ ఆఫ్ ఆర్మ్స్‌లో జరిగిన భారీ ఆయుధాల చోరీ కేసును పోలీసులు, మిలిటరీ అధికారులు అత్యంత సమర్థవంతంగా ఛేదించారు. ఈ వ్యవహారానికి సంబంధించిన పూర్తి వివరాలను తెలంగాణ డీజీపీ సీవీ ఆనంద్ వెల్లడించారు. ఈ కేసుకు సంబంధించి మొత్తం నలుగురు నిందితులను అరెస్ట్ చేసినట్లు ఆయన తెలిపారు. చోరీకి గురైన అత్యంత ప్రమాదకరమైన ఆయుధాలు, మ్యాగజైన్లు, బుల్లెట్లు, బైనాక్యులర్‌ను స్వాధీనం చేసుకున్నట్లు స్పష్టం చేశారు. ఆగస్టు 31న జరిగిన ఈ ఆయుధాల దొంగతనంలో బెల్ ఆఫ్ ఆర్మ్స్ ఇన్ ఛార్జ్, అమ్యునేషన్ సెక్షన్ ఇన్ ఛార్జ్ సహకారం ఉన్నట్లు విచారణలో తేలింది. మొదట బెల్ ఆఫ్ ఆర్మ్స్‌లోకి ప్రత్యక్షంగా ప్రవేశ అర్హత ఉన్న 16 మందిపై దృష్టి సారించిన అధికారులు, సుదీర్ఘ సాంకేతిక విచారణ చేపట్టారు. ఈ క్రమంలో హవాల్దార్లు టి.పి.ఎస్. రావు, మల్లేశ్ అలియాస్ రాజుల ప్రవర్తన అనుమానాస్పదంగా కనిపించడంతో వారిపై నిఘా పెట్టారు. విచారణ సమయంలో మల్లేశ్ అధికారులను తప్పుదోవ పట్టించే ప్రయత్నం చేసినప్పటికీ, సాంకేతిక ఆధారాలతో నిలదీయడం, అధికారులు అతడి భార్యకు పరిస్థితి వివరించడంతో అసలు నిజం బయటపడింది. భార్య గట్టిగా ప్రశ్నించడంతో మల్లేశ్ ఆయుధాల దొంగతనం ఒప్పుకున్నాడు. దర్యాప్తు వివరాల ప్రకారం.. నిందితుడు మల్లేశ్ ఆగస్టు 28, 29 తేదీల్లో ఆయుధాగారం వద్ద రెక్కీ నిర్వహించి, రాత్రి వేళల్లో సీసీ కెమెరాలు లేని మార్గాలను గుర్తించాడు. ఆగస్టు 30న కార్గిల్ గేట్ నుంచి లోపలికి వచ్చి పరిస్థితులను గమనించి, 31వ తేదీన పక్కా ప్రణాళికతో ఆయుధాలను చోరీ చేశాడు. ఆర్మీ నుంచి తనను అకారణంగా తొలగించారన్న కోపంతోనే మల్లేశ్ ఈ చర్యకు పాల్పడినట్లు ప్రాథమికంగా భావిస్తున్నారు. ఆయుధాలను చోరీ చేశాక మొదట ఒక చోట పాతిపెట్టి, ఆ తర్వాత మరో ప్రాంతానికి ఎందుకు మార్చాడనే కోణంలో లోతైన విచారణ సాగుతోందని డీజీపీ వివరించారు. ఈ చోరీకి ఎలాంటి అంతర్జాతీయ ముఠాలతో గానీ, ఉగ్రవాద సంస్థలతో గానీ సంబంధాలు ఉన్నట్లు ఇప్పటివరకు ఆధారాలు లభించలేదని డీజీపీ సీవీ ఆనంద్ స్పష్టం చేశారు. దేశ అంతర్గత భద్రతకు తీవ్ర ముప్పుగా పరిణమించే అవకాశం ఉన్న ఈ ప్రమాదకర ఆయుధాల చోరీని సత్వరమే ఛేదించిన మిలిటరీ అధికారులను, హైదరాబాద్ సిటీ పోలీస్ కమిషనర్ సజ్జనార్‌ను, దర్యాప్తు బృందాలను డీజీపీ సీవీ ఆనంద్ ప్రత్యేకంగా ప్రశంసించారు.

## బీజేపీని పక్కకు నెట్టేసిన
# కాంగ్రెస్–బీఆర్ఎస్ పోరు

మొదటిపేజీ తరువాయి

గెలుచుకోవడం, బీఆర్ఎస్ ఓటు శాతం 16-18 శాతానికి పడిపోవడంతో రాష్ట్రంలో కాంగ్రెస్‌కు ప్రత్యామ్నాయంగా ఎదిగే అవకాశం తమకే ఉందని బీజేపీ భావించింది. అయితే ప్రస్తుత పరిణామాలు అందుకు భిన్నంగా కనిపిస్తున్నాయి. అసెంబ్లీ లోపల, బయట కాంగ్రెస్-బీఆర్ఎస్ మధ్య హోరాహోరీ రాజకీయ పోరు కొనసాగుతోంది. రేవంత్‌రెడ్డి వ్యూహాలు, బీఆర్ఎస్ నిరసనలు, అరెస్టులు, కేసీఆర్ ఫామ్‌హౌస్‌కు సంబంధించిన దర్యాప్తులే రాజకీయ చర్చను ఆక్రమిస్తున్నాయి.

**దూకుడుగా బీఆర్ఎస్**

పార్లమెంట్ ఎన్నికల ఫలితాలు జాతీయ రాజకీయ అంశాల ప్రభావంతో వచ్చాయని, వాటిని రాష్ట్ర రాజకీయాల్లో బీజేపీ బలానికి కొలమానంగా చూడలేమనే అభిప్రాయం తాజా పరిణామాలతో బలపడుతోంది. క్షేత్రస్థాయిలో బలమైన కేడర్, సంస్థాగత నిర్మాణం బీఆర్ఎస్‌కు ఇప్పటికీ ఉంది. అసెంబ్లీలో కేటీఆర్, హరీశ్‌రావు నేతృత్వంలో పార్టీ ప్రభుత్వాన్ని నేరుగా ఢీకొంటోంది. ప్రభుత్వ వైఫల్యాలపై ఆందోళనలు చేపడుతూ కాంగ్రెస్‌తో రాజకీయంగా తలపడుతున్న తీరు బీఆర్ఎస్‌ను మరోసారి ప్రధాన ప్రతిపక్షంగా చర్చలోకి తీసుకొస్తోంది.

**బీజేపీకి దక్కని రాజకీయ స్థలం**

కాంగ్రెస్ వ్యూహం కూడా బీఆర్ఎస్‌ను ప్రధాన ప్రత్యర్థిగా నిలబెట్టే విధంగానే సాగుతోందనే విశ్లేషణలు వినిపిస్తున్నాయి. రేవంత్‌రెడ్డి తరచూ కేసీఆర్, బీఆర్ఎస్ నాయకత్వాన్ని లక్ష్యంగా చేసుకుంటున్నారు. బీఆర్ఎస్ హయాంలో జరిగిన అక్రమాలు, శాసనసభలో స్పీకర్ వ్యవహారం, ఎర్రవల్లి ఫామ్‌హౌస్‌కు సంబంధించిన ఆరోపణలు వంటి అంశాలతో కాంగ్రెస్-బీఆర్ఎస్ మధ్యే రాజకీయ చర్చను పరిమితం చేయగలుగుతోంది. దీంతో కేసీఆర్‌కు వ్యతిరేకంగా రేవంత్‌రెడ్డి రాజకీయ పోరాటం చేస్తున్నారనే నెరేటివ్ బలపడుతుండగా, బీజేపీకి మూడో రాజకీయ శక్తిగా నిలిచే అవకాశం తగ్గుతోంది.

**నాయకత్వ లోపంతో కమలం**

లోక్‌సభ ఎన్నికల్లో సాధించిన విజయాన్ని ఆధారంగా చేసుకుని రాష్ట్ర రాజకీయాల్లో ముందుకు వెళ్లడం సాధ్యం కాదనే విషయాన్ని బీజేపీ గుర్తించాల్సిన అవసరం ఉందనే అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. అసెంబ్లీలో ప్రజా సమస్యలను బలంగా ప్రస్తావించడంతో పాటు, కాంగ్రెస్ ప్రభుత్వంపై నిరంతర ఉద్యమాలను నిర్వహించడంలో పార్టీ వెనుకబడింది. బీజేపీ చేపడుతున్న నిరసనలు కూడా కాంగ్రెస్-బీఆర్ఎస్ మధ్య జరుగుతున్న తీవ్ర రాజకీయ పోరులో పెద్దగా ప్రభావం చూపడం లేదు.

పార్లమెంట్ ఎన్నికల తర్వాత వచ్చిన రాజకీయ మైలేజ్‌ను నిలబెట్టుకోవడంలో బీజేపీ విఫలమైతే ఆ పార్టీ సాధించిన ఎనిమిది లోక్‌సభ స్థానాల ప్రభావం క్రమంగా తగ్గిపోయే అవకాశం ఉంది. కాంగ్రెస్‌ను ఢీకొట్టగల ప్రధాన శక్తి బీఆర్ఎస్ మాత్రమే అనే భావన ప్రజల్లో మళ్లీ బలపడితే, రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో బీజేపీకి ఇది పెద్ద ప్రతికూలతగా మారే అవకాశం కనిపిస్తోంది.

## ఓవర్సీస్ స్కాలర్‌షిప్ నిధులు
# రూ.180 కోట్లు విడుదల

మొదటిపేజీ తరువాయి

నిధుల విడుదలతో విదేశాల్లో విద్యనభ్యసిస్తున్న మొత్తం 3,008మందికి భారీ ఆర్థిక ఊరట లభించిందని, స్కాలర్‌షిప్ మంజూరైన లబ్దిదారులందరికీ చెల్లింపులు పూర్తి చేసినట్లు తెలిపారు. ఈ నిధుల కేటాయింపుల్లో భాగంగా ఎస్సీ వర్గానికి చెందిన 1,193మంది విద్యార్థులకు అంబేడ్కర్ ఓవర్సీస్ విద్యా నిధి కింద రూ.48.42 కోట్లు విడుదలయ్యాయి. అలాగే ఎస్టీ వర్గానికి చెందిన 573మందికి రూ.36.95 కోట్లు, బీసీ సామాజికవర్గానికి చెందిన 179 మంది విద్యార్థులకు మహాత్మా జ్యోతిబా పూలే ఓవర్సీస్ విద్యానిధి కింద రూ.18.41 కోట్లు మంజూరు చేశారు. మైనారిటీ సామాజిక వర్గానికి చెందిన 1,063మంది విద్యార్థులకు ముఖ్యమంత్రి ఓవర్సీస్ విద్యా నిధి కింద రూ.76.13 కోట్లను విడుదల చేశారు. పేద, ప్రతిభావంతులైన విద్యార్థులు ఆర్థిక ఇబ్బందులు లేకుండా అంతర్జాతీయస్థాయి విశ్వవిద్యాలయాలలో ఉన్నత చదువులు అభ్యసించాలనే దృఢ సంకల్పంతోనే ప్రభుత్వం ఈ నిధులు విడుదల చేయడంతో విద్యార్థులు, వారి తల్లిదండ్రులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.



# పేదల చికిత్సకు చేయూత.. 22 కుటుంబాలకు సీఎంఆర్ఎఫ్



- **రూ.14.91 లక్షల చెక్కులు అందజేసిన పీఏసీ చైర్మన్ ఆరెకపూడి గాంధీ**

**శేరిలింగంపల్లి,సెప్టెంబర్ 11(సిరి న్యూస్):**

శేరిలింగంపల్లి నియోజకవర్గంలో అత్యవసర వైద్య చికిత్స కోసం ముఖ్యమంత్రి సహాయ నిధికి దరఖాస్తు చేసుకున్న 22 బాధిత కుటుంబాలకు రూ.14,91,300 చెక్కులను పీఏసీ చైర్మన్, స్థానిక ఎమ్మెల్యే ఆరెకపూడి గాంధీ అందజేశారు.నియోజకవర్గం పరిధిలోని పలువురు ఆసుపత్రి ఖర్చుల భారం మోయలేక సీఎంఆర్ఎఫ్‌కు దరఖాస్తు చేసుకోగా, మంజూరైన సహాయాన్ని చెక్కుల రూపంలో పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మాట్లాడిన గాంధీ, ముఖ్యమంత్రి సహాయ నిధి పేదలకు ఆపన్నహస్తమని,
అనారోగ్యంతో ఆర్థికంగా కుంగిపోయిన కుటుంబాలకు ఇది భరోసా అని అన్నారు.ప్రజాక్షేమమే ప్రభుత్వ లక్ష్యమని, సీఎం రేవంత్ రెడ్డి పేదల పక్షం వహిస్తున్నారని ఆయన పేర్కొన్నారు. అర్హులైన ప్రతి ఒక్కరికీ సంక్షేమ పథకాలు అందేలా కృషి చేస్తామని తెలిపారు. బాధిత కుటుంబాలు సీఎం రేవంత్ రెడ్డి, పీఏసీ చైర్మన్ గాంధీకి కృతజ్ఞతలు తెలిపారు.కార్యక్రమంలో సంజీవ రెడ్డి, నాయి నేనీ చంద్రకాంత్ రావు, జంగయ్య యాదవ్, చంద్రారెడ్డి, ఎండీ ఇబ్రహీం, జిల్లా గణేష్, క్రాంతి, మల్లయ్య, గోపాల్, శివసాగర్, సల్లాఉద్దీన్, సుధాకర్ తదితరులు పాల్గొన్నారు.

# ఫార్మర్ రిజిస్ట్రేషన్ పై అవగాహన



**మసాయిపేట ఆగస్టు 11,(సిరి న్యూస్):**

రైతులకు ఫార్మర్ రిజిస్ట్రేషన్ పై అవగాహన కల్పించేందుకు వ్యవసాయ శాఖ అధికారులు శుక్రవారం మాసాయిపేట మండలం అచ్చంపేట గ్రామంలో ఫార్మర్ రిజిస్ట్రేషన్ క్యాంపెనింగ్ నిర్వహించారు.రైతులందరూ తప్పనిసరిగా ఫార్మర్ రిజిస్ట్రేషన్ చేసుకోవాలని వ్యవసాయ విస్తరణ అధికారి భార్గవ్ గౌడ్ సూచించారు, ఫార్మర్ రిజిస్ట్రేషన్ చేసుకున్న వారి మాత్రమే కేంద్ర ప్రభుత్వం నుంచి పథకాలు అందుతాయని చెప్పడం జరిగింది, ఎరువులు ఆన్లైన్లో బుక్ చేసుకోవాలన్న ఫార్మా రిజిస్ట్రేషన్ చేసుకున్న వారికి బుక్ చేసుకుని అవకాశం ఉంటుంది కనుక తప్పనిసరిగా రైతులందరూ ఫార్మర్ రిజిస్ట్రేషన్ చేసుకోవాలని సూచించారు ఈ కార్యక్రమంలో గ్రామంలోని పలువురు రైతులు ఫార్మర్ రిజిస్ట్రేషన్ చేసుకున్నారు




# స్ట్రోమ్ వాటర్ డ్రైన్ పనులకు శంకుస్థాపన



- **పాల్గొన్న గూడెం మహిపాల్ రెడ్డి, మెట్టు కుమార్ యాదవ్**

**పటాన్‌చెరు, సెప్టెంబర్ 11, (సిరి న్యూస్)::**

సైబరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ (సీఎం సీ) నిధులు రూ.19 లక్షల అంచనా వ్యయంతో మంజూరైన స్ట్రోమ్ వాటర్ డ్రైన్ నిర్మాణ పనులకు ఈ రోజు ఉదయం శాసన సభ్యులు గూడెం మహిపాల్ రెడ్డి, పటాన్‌చెరు తాజా మాజీ కార్పొరేటర్ మెట్టు కుమార్ యాదవ్ లు శంకుస్థాపన చేశారు. ఈ కార్యక్రమంలో నర్ర బిక్షపతి, శ్రీధర్ చారి, కుమార్, రాజిరెడ్డి, శాంతినగర్-శ్రీనగర్ కాలనీ అధ్యక్షులు అంజిరెడ్డి, ఏ. వెంకట్ రెడ్డి, టైలర్ విజయ్, రవీంద్ర, కార్ రాజు, డీ ఈ కృష్ణవేణి, ఈ ఈ సురేష్ కుమార్, ఏ ఈ లావణ్య, కాంట్రాక్టర్ వెంకటరామిరెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

# చలో అసెంబ్లీకి బయలుదేరిన ముదిరాజులకు ముందస్తు అరెస్టు





- **కామారెడ్డి డిక్లరేషన్ హామీని వెంటనే అమలు చేయాలి**
- **ముదిరాజ్‌లను బీసీ-డీ నుంచి బీసీ-ఏలోకి మార్చాలి**

పెద్ద శంకరం పేట, సెప్టెంబర్ 11, (సిరి న్యూస్) ముదిరాజ్‌ల సమస్యల పరిష్కారం, హక్కుల సాధన కోసం 'చలో అసెంబ్లీ ముట్టడి' కార్యక్రమానికి బయలుదేరిన పెద్ద శంకరం పేట మండల ముదిరాజ్ సంఘం బాధ్యులను, ఇతర ముదిరాజ్ నాయకులను పెద్ద శంకరం పేట పోలీసులు ముందస్తుగా అరెస్టు చేశారు. ఈ సందర్భంగా ముదిరాజ్ లు తమ డిమాండ్లను ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలని డిమాండ్ చేశారు. కామారెడ్డిలో నిర్వహించిన ముదిరాజ్ డిక్లరేషన్ సభలో ఇచ్చిన హామీ మేరకు ముదిరాజ్‌లను ప్రస్తుత బీసీడీ రిజర్వేషన్ నుంచి బీసీఏలోకి మార్చే ప్రక్రియను వెంటనే పూర్తి చేయాలని కోరారు. అలాగే ముదిరాజ్‌ల జనాభా ప్రాతిపదికన రాజకీయంగా సముచిత ప్రాతినిధ్యం కల్పించాలని, నామినేటెడ్ పదవుల్లో ముదిరాజ్‌లకు తగిన అవకాశాలు కల్పించాలని డిమాండ్ చేశారు. మత్స్యకారులకు 18 సంవత్సరాలు నిండిన ప్రతి ఒక్కరికీ మత్స్యకార సహకార సంఘాల్లో సభ్యత్వం కల్పించాలని, మత్స్యకారుల సంక్షేమం కోసం ప్రకటించిన రూ.1,000 కోట్ల నిధులను వెంటనే విడుదల చేయాలని కోరారు. ముదిరాజ్‌లపై జరుగుతున్న అన్యాయాలను అరికట్టి, వారి హక్కులను పరిరక్షించేందుకు ప్రభుత్వం తక్షణ చర్యలు తీసుకోవాలని నాయకులు డిమాండ్ చేశారు. హామీల అమలులో జాప్యం చేయకుండా ముదిరాజ్‌ల సమస్యలకు శాశ్వత పరిష్కారం చూపాలని కోరారు. ఈ కార్య క్రమంలో మండల ముదిరాజ్ సంఘం అధ్యక్షుడు పి పున్నయ్య ముదిరాజ్, సమన్వయ సంఘం బాధ్యులు మర్పల్లి సాయిలు, శంకరయ్య, గాజు వెంకటేశం, జోడు సత్యం, రవీందర్, సాయిలు మహారాజ్, సంగమేశ్వరు, తదితరులు పాల్గొన్నారు.

**రేగోడు లో....**

రేగోడ్ మండల ముదిరాజ్ సంఘం ఆధ్వర్యంలో శుక్రవారం నాడు ఛలో హైదరాబాద్ కార్య క్రమం చేపట్టారు. వీరిని కూడా అక్కడి పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. ఈ కార్యక్రమంలో మండల ముదిరాజ్ సంఘం అధ్యక్షుడు వడ్డేపల్లి శివకుమార్ ముదిరాజ్, గ్రామ అధ్యక్షుడు గోండ్ల బసవేశ్వర్, మంద విక్టర్, బాదనపల్లి నర్సింలు, మస్కూరి రవీందర్, దోసపల్లి లక్ష్మణ్, గోపాల్, మస్కూరి కృష్ణ, నర్సింలు తదితరులతో పాటు మండలంలోని వివిధ గ్రామాల ముదిరాజ్ సంఘాల అధ్యక్షులు, నాయకులు ఉన్నారు.

# కాలనీల ర్యాంపుల సమస్యకు పరిష్కారం చూపాలి





- **నేషనల్ హైవే, ట్రాఫిక్, పోలీసు అధికారులతో పుష్పనగేష్ పర్యటన**

**రామచంద్రాపురం, సెప్టెంబర్ 11 (సిరి న్యూస్):**

రామచంద్రాపురం నుంచి లింగంపల్లి వరకు చేపడుతున్న ఆరు లేన్ల రోడ్డు విస్తరణ పనులతో కాలనీవాసులు ఎదుర్కొంటున్న ఇబ్బందులను పరిష్కరించాలని తాజా మాజీ కార్పొరేటర్ బూరుగడ్డ పుష్పనగేష్ అధికారులను కోరారు. ఈ మేరకు శుక్రవారం నేషనల్ హైవే, ట్రాఫిక్, లా అండ్ ఆర్డర్ అధికారులతో కలిసి డివిజన్‌లో పర్యటించారు. ఓల్డ్ రామచంద్రాపురం, సాయినగర్, వాసవినగర్, మల్లికార్జుననగర్, మయూరినగర్, కాకతీయనగర్, శ్రీసాయినగర్, అశోక్‌నగర్ తదితర కాలనీలకు వెళ్లే కనెక్టింగ్ రోడ్ల వద్ద రోడ్డు విస్తరణ పనుల కారణంగా ర్యాంపులు లేకపోవడంతో ప్రజలు రాకపోకలకు ఇబ్బందులు పడుతున్నారని అధికారుల దృష్టికి తీసుకెళ్లారు. పలు ప్రాంతాల్లో రోడ్లు గుంతలమయంగా మారడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని తెలిపారు. ప్రజల ఇబ్బందులను దృష్టిలో ఉంచుకుని ప్రతి కాలనీ ముఖద్వారం వద్ద రెండు, మూడు రోజుల్లో బీటీతో ర్యాంపులు ఏర్పాటు చేసి సమస్యను పరిష్కరించాలని నేషనల్ హైవే అధికారి స్వామిని కోరారు. అలాగే రామచంద్రాపురం రైల్వే ట్రాక్ వద్ద ఇటీవల మూసివేసిన యూటర్న్ కారణంగా వాహనదారులు పాత టోల్‌గేట్ వరకు వెళ్లాల్సి వస్తోందని తెలిపారు. ప్రజల సౌకర్యార్థం ఇక్రిశాట్ ముందు యూటర్న్ ఏర్పాటు చేయాలని అధికారులను కోరారు. ఈ సందర్భంగా ట్రాఫిక్ సీఐ విద్యాసాగర్‌రెడ్డి, లా అండ్ ఆర్డర్ అధికారులు పాల్గొన్నారు.

# పర్యావరణ హిత గణపతే ముద్దు





- **- సృజనాత్మక 'ఎకో-ఏకదంత' కార్యక్రమం నిర్వహించిన గీతం విద్యార్థులు**

**పటాన్‌చెరు, సెప్టెంబర్ 11 (సిరి న్యూస్):**

గణేష్‌చతుర్థిని పర్యావరణహితంగా నిర్వహించాలనే సందేశంతో గీతం డీమ్డ్ విశ్వవిద్యాలయం విద్యార్థులు శుక్రవారం 'ఎకోఏకదంత' కార్యక్రమాన్ని నిర్వహించారు. వివిధ విభాగాలకు చెందిన విద్యార్థులు సహజ మట్టితో గణేష్ విగ్రహాలను తయారు చేసి తమ సృజనాత్మకతను చాటారు. పీవోపీ విగ్రహాలు, విషపూరిత రంగులు, ప్లాస్టిక్ అలంకరణలకు దూరంగా ఉండాలని, జీవవిచ్ఛిన్నమయ్యే పదార్థాలను వినియోగించాలని ఈ కార్యక్రమం ద్వారా అవగాహన కల్పించారు. పర్యావరణ పరిరక్షణలో భాగంగా సహజ మట్టి విగ్రహాలను ఎంచుకోవాలని విద్యార్థులు సూచించారు.

**ఏఐతో ఇంజనీరింగ్‌లో కొత్త అవకాశాలు**

గీతం డీమ్డ్ విశ్వవిద్యాలయంలో 'ఏఐ అనలాగ్, ఇంజనీరింగ్ భవిష్యత్తు' అంశంపై ఆస్టర్ క్వాంటా వ్యవస్థాపకుడు, సీఈఓ ప్రదీప్ వి. పైదా శుక్రవారం ఆతిథ్య ఉపన్యాసం చేశారు. ఏఐ, అనలాగ్ టెక్నాలజీల కలయిక, వీఎల్ఎస్ఐ డిజైన్, సర్క్యూట్ డిజైన్‌లో ఏఐ వినియోగంపై ఆయన వివరించారు. ఇంజనీరింగ్ విద్యార్థులు సమస్యలను ముందుగా కాగితంపై విశ్లేషించి, పరిష్కారాలను ఆలోచించిన తర్వాత సిమ్యులేషన్‌కు వెళ్లాలని సూచించారు. అభివృద్ధి చెందుతున్న సాంకేతికతలకు అనుగుణంగా నైపుణ్యాలను పెంపొందించుకోవాలని ఆయన పిలుపునిచ్చారు. గీతం విద్యార్థులకు పారిశ్రామిక అవకాశాలను విస్తరించేందుకు ఎంవోయూ చేసుకునే అవకాశాలపై కూడా ఆయన ఆసక్తి వ్యక్తం చేశారు.

# చౌకీ మఠం లో శ్రావణమాస సమాప్తి కార్యక్రమం



**సదాశివపేట. సెప్టెంబర్ 11. (సిరిన్యూస్)**

వీరశైవ సమాజం, చౌకీ మఠం నందు పవిత్ర శ్రావణమాస సమాప్తి కార్యక్రమాన్ని పురస్కరించుకుని మహాగణపతి మహా గౌరీ పంచకలశస్థాపన మహాత్మా బసవేశ్వర పటపూజ కార్యక్రమం, పూజ్యం శ్రీ అవధూత దత్తగిరి మహారాజ్ పాద పద్మములకు పాదపూజ కార్యక్రమం నిర్వహించినట్లు అధ్యక్షులు చీల మల్లన్న అన్నారు.
పరమ పవిత్రమైనటువంటి శ్రావణమాసం ముగింపు కార్యక్రమంలో గురువులు చెప్పేటటువంటి విషయాలు ప్రవచనాధి కార్యక్రమాలు వినడం ఎంతో శ్రేయస్కరమని అన్నారు.
అదేవిధంగా చౌకీ మఠం సమాజంలో ఉన్నటువంటి జంగమ మహేశ్వర సన్మాన సత్కార కార్యక్రమం నిర్వహించినట్లు ప్రధాన కార్యదర్శి పిల్లోడి విశ్వనాథం అన్నారు. స్థానిక పెద్ద మఠం నిర్వాహకులు లింగానంద్ స్వామి మాట్లాడుతూ సదాశివపేటలో పెద్దమటం గురుపరంపరలో శ్రావణమాస కార్యక్రమాలు నిర్వహించడం ఎంతో సంతోషకరం గురుసేవలో ఉండడం చాలా సంతోషకరమని అన్నారు. కార్యక్రమంలో జంగం మహేష్ స్వామి మాట్లాడుతు తల్లిదండ్రులు జన్మనిస్తే గురువు జ్ఞానాన్ని అందజేస్తాడని , మనిషి జీవితంలో అంధకారాన్ని తొలగించి జ్ఞాన జ్యోతిని వెలిగించే శక్తి గురుకు మాత్రమే సాధ్యమని అన్నారు. గౌరవ అధ్యక్షులు బోడగామ శ్రీశైలం, కోశాధికారి పలుమామిడి వీరేశం అర్చక స్వాములు భక్తులు పాల్గొన్నారు.



# సింఫనీ హోమ్స్ 22-ఏపై సందేహాలు నివృత్తి చేయాలి

- హరీశ్‌రావు తప్పుడు ప్రచారం చేయొద్దు: నర్సింహరెడ్డి
- 4 ఎకరాల 15 గుంటల ప్రభుత్వ భూమి మాత్రమే 22-ఏలో ఉందని తహసీల్దార్ వివరణ

**పటాన్‌చెరు, సెప్టెంబర్ 11 (సిరి న్యూస్):**

పటాన్‌చెరు జేపీ కాలనీలోని సింఫనీ హోమ్స్ కాలనీకి సంబంధించి 22ఏపై నెలకొన్న సందేహాలను నివృత్తి చేయాలని కోరుతూ సంగారెడ్డి జిల్లా ఐఎన్‌టీయూసీ, పటాన్‌చెరు పట్టణ కాంగ్రెస్ కమిటీ అధ్యక్షుడు కొల్కురి నర్సింహరెడ్డి శుక్రవారం తహసీల్దార్ కార్యాలయంలో వినతిపత్రం అందజేశారు. డిప్యూటీ తహసీల్దార్ శేఖర్‌కు వినతిపత్రం అందజేసిన అనంతరం ఆయన మాట్లాడారు. 55 ఎకరాల్లో నిర్మించిన సింఫనీ హోమ్స్‌లో సుమారు 900 విల్లాలు ఉండగా, దాదాపు 5 వేల మంది నివసిస్తున్నారని తెలిపారు. కాలనీ మొత్తాన్ని 22ఏ నిషేధిత జాబితాలో చేర్చారంటూ మాజీ మంత్రి హరీశ్‌రావు చేసిన వ్యాఖ్యలపై ఆయన అభ్యంతరం వ్యక్తం చేశారు. ఇలాంటి వ్యాఖ్యలతో విల్లా యజమానుల్లో ఆందోళన నెలకొందని, వాస్తవాలను తెలుసుకోకుండా ప్రచారం చేయడం వల్ల ప్రజల్లో గందరగోళం ఏర్పడుతోందని విమర్శించారు.



రైల్వే కోసం సేకరించిన భూమి మాత్రమే..

సింఫనీ హోమ్స్ కాలనీ మొత్తాన్ని 22ఏలో చేర్చలేదని, కాలనీకి సంబంధించిన సుమారు 4 ఎకరాల 15 గుంటల ప్రభుత్వ భూమి మాత్రమే 22ఏ నిషేధిత జాబితాలో ఉందని తహసీల్దార్ ఫోన్ ద్వారా స్పష్టం చేసినట్లు నర్సింహరెడ్డి తెలిపారు. గతంలో ప్రభుత్వాలు రైల్వే లైన్ కోసం సేకరించిన ఈ భూమిని మాత్రమే 22ఏలో చేర్చినట్లు తహసీల్దార్ వివరించారని పేర్కొన్నారు. ఈ అంశంపై అధికారులు ఇప్పటికే నోట్ కూడా విడుదల చేసినట్లు తెలిపారు.

**రైల్వే భూమిని కాపాడాలి**

సింఫనీ హోమ్స్ సమీపంలోని 22ఏ భూమి భవిష్యత్‌లో లింగంపల్లి-మెదక్ రైల్వే లైన్ అవసరాలకు ఉపయోగపడే అవకాశం ఉన్నందున దాన్ని పరిరక్షించాలని నర్సింహరెడ్డి కోరారు. ప్రభుత్వ భూమిని కాపాడేందుకు ఎంపీ రఘునందన్‌రావు చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వాన్ని అప్రతిష్టపాలు చేయడం, కాలనీ ప్రజల్లో భయాందోళనలు కలిగించేలా వ్యాఖ్యలు చేయడం మానుకోవాలని హరీశ్‌రావును డిమాండ్ చేశారు. కార్యక్రమంలో మాజీ పీసీసీ కార్యదర్శి మతిన్, పట్టణ కాంగ్రెస్ ఉపాధ్యక్షులు యువరాజ్, మోరే రాజు, సాయిలు, అక్షిత్ తదితరులు పాల్గొన్నారు.

# కోతులను నివారించే దిశగా చర్యలు తీసుకోవాలి

- కోతుల బెడద నుంచి ప్రజలకు, రైతులకు ఉపశమనం కల్పించే దిశగా మున్సిపల్ కమిషనర్స్ పటిష్ట చర్యలు.
- జిల్లాలో నాలుగు మున్సిపాలిటీలో కలిసి సుమారు 6,500 కోతులు ఉన్నట్లు అంచనా.
- కోతుల బెడద నివారణకు తక్షణ కర్తవ్యంగా ఉద్యమంలా సమగ్ర కార్యచరణ.
- మెదక్ జిల్లా కలెక్టర్ ప్రతిమా సింగ్.





**మెదక్ సెప్టెంబర్,11(సిరి న్యూస్)**

కోతుల బెడద నుంచి ప్రజలకు, రైతులకు ఉపశమనం కల్పించే దిశగా మున్సిపల్ కమిషనర్స్ పటిష్ట చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ ప్రతిమాసింగ్ అధికారులను ఆదేశించారు. శుక్రవారం కలెక్టరేట్ కార్యాలయం నుండి నర్సాపూర్, తూప్రాన్ మెదక్ మున్సిపల్ కమిషనర్స్ తో గూగుల్ మీట్ ద్వారా సమీక్షించారు. కోతుల బెడద నివారణకు గత సమావేశంలో చేర్పించిన అంశాలపై తీసుకున్న చర్యలపై వివరాలు అడిగి తెలుసుకున్నారు. మెదక్ లో సుమారు 3,000 వేల కోతులు, అలాగే నర్సాపూర్లో 2వేల కోతులు, తూప్రాన్ లో 1000, రామాయంపేట మున్సిపాలిటీలో 500 కోతులు కలవని మున్సిపల్ కమిషనర్ నివేదికలు తయారు చేసినట్లు కలెక్టర్ వివరించారు. యుద్ధ ప్రాతిపదికన ఈ కార్యక్రమాన్ని ఒక ఉద్యమంలో చేపట్టి కోతులను పట్టి నిర్మల్ జిల్లాకు తరలించి ఆపరేషన్ అనంతరం ఆ జిల్లాలోనే వదిలి వేసే విధంగా చర్యలు తీసుకుంటున్నట్లు వివరించారు. నిర్మూలన ప్రజలకు రైతులకు ఉపశమనం కలుగుతుందని ఈ సందర్భంగా కలెక్టర్ వెల్లడించారు. కోతుల బెడద నియంత్రణను ఒక ఉద్యమంలా చేపట్టి దశలవారీగా ముందుకు సాగితే జిల్లాలో సమస్యను గణనీయంగా నియంత్రించవచ్చని కలెక్టర్ ప్రతిమా సింగ్ అన్నారు. ఇందుకు అన్ని వర్గాల సహకారం అవసరమని పేర్కొన్నారు. రైతులు, ప్రజలకు కోతుల బెడద నుంచి ఉపశమనం కల్పించి మెదక్ జిల్లాను కోతుల నియంత్రణలో ఆదర్శ జిల్లాగా తీర్చిదిద్దేందుకు సమష్టిగా కృషి చేయాలని అధికారులకు సూచించారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ నగేష్, డీఎఫ్ఓ జోజి,డి. పి.ఓ యాదయ్య,మున్సిపల్ కమిషనర్స్ తదితరులు పాల్గొన్నారు.

# బీవిఆర్ఐటి లో ఫెయిలాథాన్ 4వ ఎడిషన్






- వైఫల్యం నుంచి ఆవిష్కరణ వైపు
- రండి, విఫలమవుదాం నేర్చుకుందాం

**నర్సాపూర్ సెప్టెంబర్ 11 (సిరి న్యూస్)**

విష్ణు వెంచర్ ల్యాబ్స్ ఫౌండేషన్, బి.వి. రాజు ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీకి చెందిన బేసిక్ సైన్సెస్ అండ్ హ్యూమానిటీస్ విభాగం సహకారంతో శుక్రవారం బి.వి. రాజు ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీకి కాలేజ్ లో ఫెయిలాథాన్ 4వ ఎడిషన్‌ను కార్యక్రమం నిర్వహించింది. మొదటి సంవత్సరం విద్యార్థుల కోసం 24 గంటల ఆలోచనా వేదిక "రండి, విఫలమవుదాం - నేర్చుకుందాం!!!!!" అనే స్ఫూర్తిదాయకమైన నినాదంతో సాగింది. వైఫల్యాన్ని నేర్చుకోవడం, సృజనాత్మకత, ఆవిష్కరణలో ఒక ముఖ్యమైన భాగంగా ఈ కార్యక్రమం విద్యార్థులను ప్రోత్సహించింది. విద్యార్థులకు తరగతి గదిని దాటి, ఆవిష్కరణ ప్రక్రియను ప్రత్యక్షంగా అనుభవించే అవకాశాన్ని కల్పించి. విద్యార్థులు తమ చుట్టూ ఉన్న వాస్తవ సమస్యలను గమనించి, ముఖ్యమైన సమస్యలను గుర్తించి, వాటి వల్ల ప్రభావితమయ్యే వ్యక్తుల అవసరాలను అర్థం చేసుకుని. అనంతరం వివిధ సృజనాత్మక ఆలోచనలను అన్వేషిస్తూ, చర్చలు పరస్పర సహకారం ద్వారా తమ ఆలోచనలను మెరుగుపరుచుకోవడం విద్యార్థులు తమ ఆలోచనలను ఆచరణాత్మకమైన, క్రమబద్ధమైన పరిష్కారాలుగా మార్చారు. పరిమిత సమయంలో పనిచేస్తూ, తమ ఆలోచనలను పరిశీలించి, వాటిని నిరంతరం మెరుగుపరుచుకుంటూ. ఈ అనుభవం సృజనాత్మకంగా ఆలోచించడంతో పాటు,
తమ పరిష్కారాల సాధ్యాసాధ్యాలు, ఉపయోగ ప్రభావాన్ని పరిగణనలోకి తీసుకునేలా విద్యార్థులను ప్రోత్సహించింది. చివరి దశలో విద్యార్థులు తమ ప్రదర్శనల ద్వారా ప్రతిపాదించిన పరిష్కారాలను మాత్రమే కాకుండా, ప్రయోగం, అభ్యాసం నిరంతర అభివృద్ధితో కూడిన తమ ప్రయాణాన్ని కూడా ప్రదర్శించారు.ఫెయిలాథాన్ విద్యార్థుల్లో సమస్య పరిష్కార నైపుణ్యం, సృజనాత్మకత బృందపని, సమాచార మార్పిడి, నాయకత్వ లక్షణాలు ,వ్యాపార ఆలోచనా విధానాన్ని అభివృద్ధి చేసింది. 24 గంటల వ్యవధి విద్యార్థులకు ఒత్తిడిలో కలిసి పనిచేయడం, సమయాన్ని సమర్థవంతంగా నిర్వహించడం, వైఫల్యాల నుంచి నేర్చుకోవడం తమ ఆలోచనలను నిరంతరం మెరుగుపరచడం వంటి నైపుణ్యాలను అందించింది.

**వైఫల్యం విజయానికి వ్యతిరేకం కాదు;**

విజయాన్ని చేరుకునే ప్రయాణంలో అది ఒక ముఖ్యమైన భాగం అనే ఫెయిలాథాన్ ప్రధాన స్ఫూర్తిని విద్యార్థులు ప్రయోగాలు చేయడానికి, విఫలమవడానికి, నేర్చుకోవడానికి మళ్లీ ప్రయత్నించడానికి స్వేచ్ఛను కల్పించడం విద్యార్థుల్లో పట్టుదల, ఆత్మవిశ్వాసం ఆవిష్కరణాత్మక ఆలోచనా విధానాన్ని పెంపొందించింది.

# మైపాల్ కుటుంబానికి రూ.4.21 లక్షల ఆర్థిక సహాయం!!

**శివంపేట సెప్టెంబర్ 11 ( సిరి న్యూస్ )**

శివంపేట పోలీస్‌స్టేషన్‌లో కానిస్టేబుల్‌గా విధులు నిర్వహించిన మైపాల్ ఇటీవల జరిగిన రోడ్డు ప్రమాదంలో మృతి చెందడంతో ఆయన కుటుంబాన్ని ఆదుకునేందుకు పోలీసుశాఖ ముందుకు వచ్చింది, ఎస్పీ ఆధ్వర్యంలో మైపాల్ కుటుంబ సభ్యులు, ఆయన బ్యాచ్‌మేట్స్, ఇతర పోలీసు అధికారులు కలిసి రూ.3,21,000 ఆర్థిక సహాయాన్ని సమకూర్చి అందజేయగా, శివంపేట పోలీస్‌స్టేషన్ తరపున మరో రూ.1,00,000 ఆర్థిక సహాయాన్ని అందించారు, దీంతో మొత్తం రూ.4,21,000 నగదు సహాయాన్ని మైపాల్ కుటుంబ సభ్యులకు అందజేశారు, ఈ సందర్భంగా అధికారులు మైపాల్ కుటుంబ సభ్యులను పరామర్శించి వారి పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు, విధి నిర్వహణలో మైపాల్ అందించిన సేవలను గుర్తుచేసుకున్నారు, సహచరుడిని కోల్పోవడం పోలీసు శాఖకు తీరని లోటని పేర్కొన్నారు, కుటుంబానికి జరిగిన నష్టాన్ని ఎవరూ భర్తీ చేయలేరని, అయితే కష్టకాలంలో కుటుంబానికి అండగా నిలవడం తమ బాధ్యతగా భావించి ఆర్థిక సహాయాన్ని అందించినట్లు తెలిపారు, మైపాల్ కుటుంబానికి భవిష్యత్తులో కూడా అవసరమైన సహాయ సహకారాలు అందించేందుకు పోలీసుశాఖ ఎల్లప్పుడూ అండగా ఉంటుందని అధికారులు భరోసా ఇచ్చారు, ఈ కార్యక్రమంలో తూప్రాన్ డీఎస్పీ నరేందర్ గౌడ్, తూప్రాన్ సీఐ వెంకటరాజు గౌడ్, శివంపేట ఎస్సై మధుకర్ రెడ్డి, పోలీసు అధికారులు, సిబ్బంది, మైపాల్ కుటుంబ సభ్యులు పాల్గొన్నారు, మైపాల్ కుటుంబానికి పోలీసుశాఖ, సహచర సిబ్బంది అందించిన ఈ ఆర్థిక సహాయం మానవీయతకు నిదర్శనంగా నిలిచింది.




## మూసా పేట లో పూర్తి అయిన సప్త భజన

**పెద్ద శంకరం పేట, సెప్టెంబర్ 11, (సిరి న్యూస్):**

మండల పరిధి లోనిమూసా పేట గ్రామం లో గత వారం రోజులుగా కొనసాగిన సప్త భజన బుధవారం రాత్రి తో పూర్తి అయింది. ఈ రోజు జంబికుంట గ్రామానికి చెందిన భజన మండలి సభ్యులు మాజీ సర్పంచ్ రఘుపతి రెడ్డి ఆధ్వర్యంలో గ్రామానికి చేరుకుని భజన కార్యక్రమంలో పాల్గొన్నారు.గురువారం ఉదయం గ్రామంలో అన్నీ వీధులు భక్తులు కలియ తిరుగుతూ భజన చేయడం విశేషం. గజవాడ మహేష్ గుప్త, మాజీ సర్పంచ్ నర్సింలు సెట్, అశోక్ లు ఈ కార్య క్రమంలో చురుకుగా పాల్గొన్నారు. పెద్ద శంకరం పేట నుంచి కూడా శ్రీ రామ్ మందిరం భజన మండలి సభ్యులు ఒక రోజు సప్త భజన కార్యక్రమంలో పాల్గొన్నారు. గత వారం రోజుల నుంచి గ్రామంలో భక్తి పారవశ్యం వెల్లివిరిసింది.



## ఘనంగా ఉపాధ్యాయ దినోత్సవ వేడుక



**పాపన్నపేట్ సెప్టెంబర్ 11 సిరి న్యూస్ :**

పాపన్నపేట మండల విద్యాశాఖ ఆధ్వర్యంలో మండల విద్యాశాఖాధికారి ప్రతాప్ రెడ్డి అధ్యక్షతన ఉపాధ్యాయ దినోత్సవ వేడుకను కొత్తపల్లిలోని అనంతపద్మనాభ స్వామి ఫంక్షన్ హాల్ లో ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా తహశీల్దార్ సతీష్ కుమార్ ,ఎంపీడీవో విష్ణు వర్ధన్ లు హాజరయ్యారు. ఈ సందర్భంగా తహశీల్దార్ సతీష్ కుమార్ మాట్లాడుతూ ఉన్నతమైన వృత్తి ఉపాధ్యాయ వృత్తి అని , ఎంత ఎత్తుకు ఎదిగినా గురువులను మర్చిపోవద్దని ,సమాజానికి గురువులే దిక్సూచి అని అన్నారు. ఈ కార్యక్రమంలో విద్యార్థులు చేసిన సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. మండల స్థాయి లో ముప్పై రెండు మంది ఉపాధ్యాయులను సన్మానించారు. అలాగే జిల్లా స్థాయి లో ఉత్తమ ఉపాధ్యాయులుగా అవార్డు పొందిన ఏడుగురిని సైతం సన్మానించారు. ఈ కార్యక్రమంలో కాంప్లెక్స్ ప్రధానోపాధ్యాయులు మహేశ్వర్ ,శ్రీనివాస్ రావు , భూజాత , శ్రీనివాస్ రెడ్డి ఉపాధ్యాయ సంఘాల నాయకులు పంతుల రాజు , బాలరాజు , ఎల్లం ,దుర్గాప్రసాద్ , భూషణం ,సురేష్ ,రమేష్ , బాల మల్లేష్ , రాజశేఖర్ , రఫీ ఉపాధ్యాయులు వెంకట్రాం రెడ్డి నాగ భూషణం ,సాయి సిరి తదితరులు పాల్గొన్నారు.

## పర్యావరణ పరిరక్షణ ప్రతి ఒక్కరి బాధ్యత



- మట్టి వినాయకుని పూజిద్దాం
- ఎండోమెంట్ కమిషనర్ హనుమంతరావు

**పెద్ద శంకరంపేట, సెప్టెంబర్ 11, (సిరి న్యూస్)**

:పర్యావరణ పరిరక్షణ ప్రతి ఒక్కరి బాధ్యత అని వినాయక చవితి పండుగకు ప్రతి ఒక్కరు మట్టి వినాయకులను ప్రతిష్టించి పూజించాలని దేవాదాయ ధర్మాదాయ శాఖ కమిషనర్ హనుమంతరావు పేర్కొన్నారు. శుక్రవారం వివిధ పనుల నిమిత్తం దేవాదాయ శాఖ అర్చక ఉద్యోగులు హైదరాబాదు లో ప్రధాన కార్యాలయానికి వెళ్లడంతో వారికి వినాయక చవితి పండుగ పురస్కరించుకొని మట్టి వినాయకులను ఉచితంగా అంద జేస్తున్నామన్నారు. ప్రజలు అందరూ మట్టి వినాయకుడు మాత్రమే పూజించి పండుగను భక్తిశ్రద్ధలతో జరుపు కోవాలని తద్వారా పర్యావరణ పరిరక్షణలో భాగస్వాములు కావాలని ఆయన పిలుపు నిచ్చారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర డిడిఎన్ అర్చక సంఘం అధ్యక్షులు వాసుదేవ శర్మ. రాష్ట్ర ఉపాధ్యక్షులు గుడి చంద్రశేఖర్. సూరజ్ తివారి, గుడి సంతోష్ కుమార్, గోవింద మిశ్రా, ఇతరులు పాల్గొన్నారు.

## విద్యార్థి దశలో ఇంటర్మీడియట్ ఎంతో కీలకం



- విద్యార్థులు ఉన్నత శిఖరాలను అధిరోహించాలి
- కళాశాల ప్రిన్సిపల్ శోభారాణి, మండల విద్యాధికారి వి శేఖర్

**పెద్ద శంకరంపేట, సెప్టెంబర్ 11,(సిరి న్యూస్):**

విద్యార్థి దశలో ఇంటర్మీడియట్ ఎంతో కీలకమని, విద్యార్థులు కష్టపడి చదివి ఉన్నత శిఖరాలను అధిరోహించాలని పెద్ద శంకరంపేట జూనియర్ కళాశాల ప్రిన్సిపల్ శోభారాణి, మండల విద్యాధికారి వి శేఖర్ లు అన్నారు. శుక్రవారం పెద్ద శంకరం పేట లోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో నిర్వహించిన ప్రెషర్స్ డే సందర్భంగా వారు మాట్లాడారు. విద్యార్థులు కష్టపడి చదివి జీవితంలో లక్ష్యం పెట్టుకొని ప్రణాళిక బద్ధంగా ముందుకు సాగాలన్నారు. ఇంటర్మీడియట్ పరీక్షల్లో మంచి మార్కులు సాధించి, భవిష్యత్తులో మంచి కోర్సులను ఎంచుకొని అత్యుత్తమ స్థానాలకు విద్యార్థులు ఎదగాలన్నారు. ఈ సందర్భంగా విద్యార్థులు ప్రదర్శించిన సాంస్కృతిక ప్రదర్శనలు అందరిని ఎంతగానో ఆకట్టుకున్నాయి. ఈ కార్యక్రమంలో కళాశాల లెక్చరర్లు అనంత రాజు శర్మ, ప్రభాకర్, మల్లేశం, రాజు, విద్యార్థులు పాల్గొన్నారు.

# అర్హులైన లబ్ధిదారులకు స్మార్ట్ రేషన్ కార్డులు పంపిణీ



**వెల్దుర్తి, సెప్టెంబర్ 11, (సిరి న్యూస్):**

వెల్దుర్తి మండలం దామరంచ గ్రామంలో అర్హులైన లబ్ధిదారులకు కొత్త స్మార్ట్ రేషన్ కార్డులను గ్రామ సర్పంచ్ , మండల తహసిల్దార్ విజయలక్ష్మి చేతుల మీదుగా పంపిణీ చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన హామీ మేరకు స్మార్ట్ రేషన్ కార్డును పంపిణీ చేయడం అభినందనీయమని అన్నారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ మాట్లాడుతూ రేషన్ కార్డులు పేద కుటుంబాలకు ఎంతో ఉపయోగకరమని, ప్రభుత్వ సంక్షేమ పథకాల ప్రయోజనాలు అర్హులకు అందేలా కృషి చేస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో విట్టల్ గౌడ్, శేఖర్ గౌడ్, రెవెన్యూ ఇన్స్పెక్టర్ నర్సింగ్ యాదవ్, గ్రామపంచాయతీ కార్యదర్శి, జిపిఓ, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

# మట్టి విగ్రహాన్ని పూజిద్దాం!! పర్యావరణాన్ని కాపాడుదాం!!



**శివంపేట్ సెప్టెంబర్ 11 ( సిరి న్యూస్ )**

ఎదుల్లాపూర్ గ్రామంలోని ప్రాథమిక పాఠశాలలో ఉన్నటువంటి పర్యావరణ పరిరక్షణ కమిటీ (ఏకో క్లబ్) కి చెందిన విద్యార్థులు మట్టి గణపతి వాడకంపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఇందులో భాగంగా విద్యార్థులు మట్టితో గణపతి ప్రతిమలను తయారు చేసి ,పి.ఓ.పి విగ్రహాలు మట్టి విగ్రహాల వలన కలిగే లాభనష్టాలను వివరిస్తూ గోడపత్రికలను తయారు చెసి గ్రామంలో ప్రదర్శిస్తూ ర్యాలీ నిర్వహించారు. గ్రామంలో ఏర్పాటు చేసే మండపాలలో కూడా మట్టి విగ్రహాన్ని ఏర్పాటు చేసే విధంగా నిర్వాహకులను ప్రోత్సహించాలని గ్రామ పాలకవర్గానికి, గ్రామ కార్యదర్శికి వినతి పత్రం సమర్పించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ఈకో క్లబ్ కమిటీ అధ్యక్షులు పైనం.నిత్యశ్రీ ,ప్రణీత్, హన్సిత్, షిఫా ఫాతిమా, వింధ్యశ్రీ ,వందన పాఠశాల ప్రధానోపాధ్యాయులు చల్లా వంశీ పాల్గొన్నారు.

# డబుల్ రోడ్డు నిర్మాణం కోసం నిధులు మంజూరు చేయాలి



- **మెదక్ ఎంపీ రఘునందన్ రావుకు వినతి పత్రం అందజేసిన బిజెపి నాయకులు**

**వెల్దుర్తి, సెప్టెంబర్ 11, (సిరి న్యూస్):**

వెల్దుర్తి నుండి మెదక్ వరకు డబుల్ రోడ్డు నిర్మాణం కోసం నిధులు మంజూరు చేయాలని మెదక్ బిజెపి జిల్లా అధ్యక్షుడు వాల్దాస్ మల్లేష్ గౌడ్,ఆధ్వర్యంలో బిజెపి రాష్ట్ర ఓ బి సి ఉపాధ్యక్షుడు పాప గారి చిన్న రమేష్ గౌడ్,పలువురు బిజెపి నాయకులు మెదక్ ఎంపీ రఘునందన్ రావు ను కలిసి వినతిపత్రం అందజేశారు శుక్రవారం నాడు మెదక్ ఎంపీ రఘునందన్ రావు ను కలిసి వెల్దుర్తి రోడ్డు పూర్తిగా శిధిలావస్థకు చేరుకుందని కనీసం ద్విచక్ర వాహనం కూడా వెళ్లడానికి రాకుండా పూర్తిగా గుంతలమయంతోపాటు అక్కడక్కడ పూర్తిగా శిథిలావస్థకు చేరుకుందని ఎంపీకి వివరించారు. రోడ్డు నిర్మాణం
చేయకపోతే రోడ్డు ప్రమాదాలు అవుతాయన్నారు. త్వరలో రోడ్డు నిర్మాణం కోసం నిధులు మంజూరు చేయాలని ఎంపీని కోరారు. ఈ కార్యక్రమంలో జిల్లా జీఎస్ సంఘసాని సురేష్, జిల్లా కార్యదర్శి ఆంజనేయులు గౌడ్, మండల అధ్యక్షుడు రవి, కౌన్సిలర్ కొండలరావు,అల్లిపూర్ సర్పంచ్ కుమార్, ఓబిసి జీఎస్ శ్రీనివాస్ గౌడ్ నగేష్, లు తదితరులు పాల్గొన్నారు.

# మాదకద్రవ్యాల నియంత్రణకు డీ-అడిక్షన్ కేంద్రాలు

**సిద్దిపేట జిల్లా ప్రతినిధి, సెప్టెంబర్ 11**

జిల్లాలో మాదకద్రవ్యాల వినియోగాన్ని నియంత్రించడం, మాదకద్రవ్యాల బారిన పడిన వారికి చికిత్స, పునరావాసం, అవగాహన కల్పించేందుకు డీఅడిక్షన్ కేంద్రాలను ఏర్పాటు చేయనున్నట్లు జిల్లా సంక్షేమ అధికారి సీహెచ్ శారద శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. జాతీయ మాదకద్రవ్యాల నిర్వహణ తగ్గింపు కార్యాచరణ ప్రణాళిక పథకం కింద కేంద్రాలను ఏర్పాటు చేసి నిర్వహించేందుకు అర్హత కలిగిన ఆసక్తిగల స్వచ్ఛంద సంస్థల నుంచి ప్రతిపాదనలు స్వీకరిస్తున్నట్లు ఆమె పేర్కొన్నారు. కేంద్ర సామాజిక న్యాయం, సాధికారత మంత్రిత్వ శాఖ మార్గదర్శకాలకు అనుగుణంగా అర్హత కలిగిన సంస్థలు దరఖాస్తు చేసుకోవాలని సూచించారు.

## 241డివిజన్లో బీఆర్ఎస్ టికెట్ రేసు..

# ముందంజలో కాసాని శ్రీధర్

- **మక్తా మహబూబ్‌పట్నంలో బలమైన పట్టు ఉందని స్థానిక చర్చ**



**శేరిలింగంపల్లి,సెప్టెంబర్ 11(సిరి న్యూస్):**

రాబోయే పురపాలక ఎన్నికల నేపథ్యంలో జీహెచ్ఎంసీ డివిజన్ 241లో బీఆర్ఎస్ కార్పొరేటర్ టికెట్ కోసం పలువురు ఆశావహులు ప్రయత్నాలు కొనసాగిస్తున్నారు.ఈ నేపథ్యంలో కాసాని శ్రీధర్ ముదిరాజ్ పేరు ముందువరుసలో వినిపిస్తోందని స్థానిక రాజకీయ వర్గాల్లో చర్చ జరుగుతోంది.మక్తా మహబూబ్‌పట్నం ప్రాంతంలో ఆయనకు ప్రజలతో సన్నిహిత పరిచయాలు ఉన్నాయని, యువతతో మంచి అనుబంధం ఉందని అనుచరులు చెబుతున్నారు. ప్రజా సమస్యలపై సమయానికి స్పందించే తీరు రాజకీయంగా అదనపు బలంగా మారుతోందని వారు పేర్కొంటున్నారు. సామాజిక కార్యక్రమాల్లో చురుకుగా పాల్గొనడం ఆయన అభ్యర్థిత్వానికి అనుకూలంగా ఉందని స్థానికంగా అభిప్రాయం వ్యక్తమవుతోంది.కాసాని కుటుంబానికి రాజకీయ నేపథ్యం ఉంది. శ్రీధర్ తండ్రి కాసాని రామాంజనేయులు గతంలో ఉపసర్పంచ్‌గా పనిచేశారు.కాసాని జ్ఞానేశ్వర్ ముదిరాజ్ చేవెళ్ల ఎంపీగా రాజకీయంగా కీలక పాత్ర పోషిస్తున్నారు.కుటుంబ అనుభవం,ప్రజలతో ఏర్పడిన అనుబంధం శ్రీధర్‌కు కలిసొచ్చే అంశాలుగా స్థానిక నాయకులు చూస్తున్నారు.డివిజన్‌లో పార్టీని బలోపేతం చేయడంతో పాటు స్థానిక ప్రజా సమస్యలు, మౌలిక వసతుల అభివృద్ధిపై దృష్టి సారించాలని ఆయన అనుచరులు పార్టీ అధిష్ఠానాన్ని కోరుతున్నారు. టికెట్ లభిస్తే ప్రజల ఆశీర్వాదంతో పనిచేసి విజయం సాధిస్తామని వారు చెబుతున్నారు. ప్రజలకు అందుబాటులో ఉండి సమస్యలను నేరుగా పరిష్కరించడమే లక్ష్యమని తెలిపారు.డివిజన్ 241లో పలువురు పోటీ పడుతున్న నేపథ్యంలో శ్రీధర్ పేరు ముందంజలో వినిపించడం రాజకీయ ఆసక్తిని పెంచింది. పార్టీ అధిష్ఠానం తీసుకునే తుది నిర్ణయం స్థానిక సమీకరణాలపై ప్రభావం చూపే అవకాశం ఉందని రాజకీయ వర్గాలు అంచనా వేస్తున్నాయి.

# అవార్డులతో బాధ్యత మరింత పెరిగింది






- **వెల్దుర్తి లో ఉత్తమ ఉపాధ్యాయులకు ఘన సన్మానం**
- **మండలానికి రాష్ట్రస్థాయి అవార్డు దక్కడం గర్వకారణం**
- **మండల విద్యాధికారి బుచ్చ నాయక్**

**వెల్దుర్తి, సెప్టెంబర్ 11 ( సిరి న్యూస్)***

విద్యార్థుల భవిష్యత్తును తీర్చిదిద్దడంలో ఉపాధ్యాయుల పాత్ర ఎంతో కీలకమని వెల్దుర్తి మండల విద్యాధికారి బుచ్చ నాయక్ అన్నారు. ఇటీవల సెప్టెంబర్ 5న జిల్లా కలెక్టర్ చేతుల మీదుగా ఉత్తమ ఉపాధ్యాయ అవార్డులు అందుకున్న ఉపాధ్యాయుని ఉపాధ్యాయులకు వెల్దుర్తి పీఎం శ్రీ జిల్లా ఉన్నత పాఠశాల యందు ఏర్పాటు చేసిన మండల ఉత్తమ ఉపాధ్యాయులకు, మండల విద్యాధికారి బుచ్చ నాయక్ ఆధ్వర్యంలో ఉపాధ్యాయులకు శాలువాలతో ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ఉత్తమ ఉపాధ్యాయ అవార్డులు అందుకోవడం గర్వకారణమని, ఉపాధ్యాయులు అందించిన సేవలకు లభించిన గుర్తింపుగా ఈ పురస్కారాలను భావించాలని అన్నారు. అవార్డులతో ఉపాధ్యాయులపై బాధ్యత మరింత పెరుగుతుందని, విద్యార్థులకు విద్యతో పాటు నైతిక విలువలను అందించి ఉత్తమ పౌరులుగా తీర్చిదిద్దేందుకు మరింత అంకితభావంతో పనిచేయాలని కోరారు. విద్యార్థుల జీవితాల్లో సానుకూల మార్పు తీసుకురావడమే ఉపాధ్యాయుల నిజమైన విజయమని, సమాజ నిర్మాణంలో ఉపాధ్యాయుల సేవలు చిరస్మరణీయమని పేర్కొన్నారు. అంతేకాకుండా రాష్ట్ర స్థాయి ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు అందుకున్న ఉపాధ్యాయుడు సాంబయ్య ను ఘనంగా సన్మానించారు. సన్మానానికి స్పందించిన ఉపాధ్యాయులు మాట్లాడుతూ.. తమకు లభించిన అవార్డు సన్మానం మరింత బాధ్యతను పెంచిందన్నారు. తమ సేవలను గుర్తించి గౌరవించడం ఎంతో ఆనందంగా ఉందని, ఈ ప్రోత్సాహం విద్యార్థుల కోసం మరింత అంకితభావంతో పనిచేసేందుకు స్ఫూర్తినిస్తుందని తెలిపారు. రాష్ట్ర ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు అందుకున్న సాంబయ్య మాట్లాడుతూ మండల కేంద్రంలో పనిచేస్తున్న నాకు రాష్ట్ర ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు రావడం వల్ల మరింత బాధ్యత పెరిగిందని, గ్రామస్తుల నాయకుల సహాయ సహకారాలతో తోటి ఉపాధ్యాయుల సహాయంతో ఇట్టి పాఠశాలను మరింత ముందుకు తీసుకెళ్తానని పిల్లల భవిష్యత్తుకు నా వంతు కృషి చేస్తానని వారు అన్నారు. ఈ కార్యక్రమం లో వివిధ ఉపాధ్యాయ సంఘాల అధ్యక్షులు, కార్యదర్శులు తదితరులు పాల్గొన్నారు.

# నేడు గణేష్ ఉత్సవాల నిర్వహణపై యువతకు అవగాహన కార్యక్రమం!

- **ఉత్సవాలను ప్రశాంతంగా, భక్తిశ్రద్ధలతో నిర్వహించాలి!!**
- **ఎస్సై మధుకర్ రెడ్డి!!!**



**శివంపేట సెప్టెంబర్ 11 ( సిరి న్యూస్ )**

గణేష్ ఉత్సవాల నిర్వహణ, గణేష్ మండపాల ఏర్పాటు, భద్రతా చర్యలు, ట్రాఫిక్ నియంత్రణ తదితర అంశాలపై శివంపేట మండలంలోని వివిధ గ్రామాల యువకులకు రేపు అవగాహన కార్యక్రమం నిర్వహించనున్నట్లు స్థానిక శివంపేట మండల ఎస్సై మధుకర్ రెడ్డి తెలిపారు. ఈ సందర్భంగా ఎస్సై మాట్లాడుతూ గణేష్ ఉత్సవాలను ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా ప్రశాంత వాతావరణంలో నిర్వహించేందుకు ప్రతి ఒక్కరూ సహకరించాలని సూచించారు. గణేష్ మండపాల ఏర్పాటులో రహదారులపై ట్రాఫిక్‌కు అంతరాయం కలగకుండా ప్రత్యేక జాగ్రత్తలు తీసుకోవాలని, ప్రజల రాకపోకలకు ఇబ్బంది లేకుండా మండపాలను ఏర్పాటు చేసుకోవాలని తెలిపారు. ఉత్సవాల సందర్భంగా పెద్ద సంఖ్యలో భక్తులు, ప్రజలు మండపాల వద్దకు వచ్చే అవకాశం ఉన్నందున భద్రతకు అధిక ప్రాధాన్యత ఇవ్వాలని సూచించారు. విద్యుత్ వైరింగ్, మండపాల పరిసరాల్లో భద్రతా ఏర్పాట్లు, వాహనాల రాకపోకలు వంటి అంశాల్లో నిర్వాహకులు అప్రమత్తంగా ఉండాలని తెలిపారు. ఇతరులకు అసౌకర్యం కలిగించే విధంగా ఎలాంటి కార్యక్రమాలు నిర్వహించకుండా పోలీసుల సూచనలు పాటించాలని ఎస్సై మధుకర్ రెడ్డి కోరారు. గణేష్ ఉత్సవాలను భక్తిశ్రద్ధలతో, సోదరభావంతో విజయవంతంగా నిర్వహించేందుకు యువత ముందుండాలని సూచించారు. రేపు నిర్వహించనున్న అవగాహన కార్యక్రమంలో శివంపేట మండలంలోని వివిధ గ్రామాలకు చెందిన యువకులు, గణేష్ ఉత్సవాల నిర్వాహకులు పాల్గొని అవసరమైన సూచనలు, భద్రతా చర్యలపై అవగాహన పొందాలని ఎస్సై తెలిపారు. ప్రజల భద్రత, శాంతిభద్రతలు, ట్రాఫిక్ సమస్యలను దృష్టిలో ఉంచుకొని ప్రతి ఒక్కరూ బాధ్యతగా వ్యవహరించాలని కోరారు. గణేష్ ఉత్సవాలు అందరికీ ఆనందాన్ని కలిగించేలా, ఎలాంటి అవాంఛనీయ సంఘటనలకు తావులేకుండా నిర్వహించేందుకు నిర్వాహకులు పోలీసులకు సహకరించాలని ఎస్సై మధుకర్ రెడ్డి తెలిపారు

# ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో పోషణ మాసం అవగాహన కార్యక్రమం!!



**శివంపేట్ సెప్టెంబర్ 11(సిరి న్యూస్ )**

శివంపేట ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో పోషణ మాసం సందర్భంగా ఐసీడీఎస్ ఆధ్వర్యంలో గర్భిణీలకు పోషణ మరియు ఆరోగ్యంపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో స్థానిక వైద్యాధికారి డాక్టర్ సాయి సౌమ్య పాల్గొని గర్భిణీలకు పలు ఆరోగ్య సూచనలు అందించారు. ప్రతిరోజూ తీసుకునే ఆహారంలో పోషక విలువలు కలిగిన ఆహారాన్ని తీసుకోవాలని, అందుబాటులో లభించే ఆకుకూరలు, కూరగాయలను విరివిగా తీసుకోవాలని సూచించారు. అలాగే చిరుధాన్యాలను కూడా ఆహారంలో భాగంగా చేసుకోవాలని తెలిపారు.ఈ సందర్భంగా ఐసీడీఎస్ సూపర్వైజర్ మాట్లాడుతూ గర్భిణీలు ప్రతిరోజూ అంగన్వాడీ కేంద్రాలకు వచ్చి ఆరోగ్యలక్ష్మి భోజనాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. గర్భధారణ దశ నుంచే సరైన పోషకాహారం తీసుకుంటూ ఆరోగ్య సూచనలు పాటించడం ద్వారా ఆరోగ్యవంతమైన కుటుంబాలను, ఆరోగ్యవంతమైన సమాజాన్ని నిర్మించవచ్చని తెలిపారు. ఆరోగ్యవంతమైన సమాజంతోనే బంగారు తెలంగాణ నిర్మాణం సాధ్యమవుతుందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఆరోగ్య సిబ్బంది, అంగన్వాడీ టీచర్లు మరియు గర్భిణీలు పాల్గొన్నారు.

# ఆరు నెలలుగా జీతాలు లేక కార్మికుల అవస్థలు

- **పండుగ పూట కూడా పస్తులే ఉండాలా**
- **జీతాలు చెల్లించకుంటే మార్కెట్ ఎదుట పెద్ద ఎత్తున ధర్నా**
- **గజ్వేల్ ప్రజ్ఞాపూర్ మున్సిపల్ బీజేపీ అధ్యక్షులు దేవులపల్లి మనోహర్ యాదవ్**

**గజ్వేల్ ప్రతినిధి, సెప్టెంబర్ 11,**

గజ్వేల్ సమీకృత కూరగాయల మార్కెట్‌లో ప్రతిరోజూ మార్కెట్‌ను పరిశుభ్రంగా ఉంచుతూ విధులు నిర్వహిస్తున్న కార్మికులకు గత ఆరు నెలలుగా జీతాలు చెల్లించకుండా ఇబ్బందులకు గురిచేయడం సరికాదని గజ్వేల్‌ప్రజ్ఞాపూర్ మున్సిపల్ భారతీయ జనతా పార్టీ అధ్యక్షులు దేవులపల్లి మనోహర్ యాదవ్ అన్నారు. శుక్రవారం ఆయన మాట్లాడుతూ కార్మికుల శ్రమను గుర్తించి, వారికి రావాల్సిన జీతాలను వెంటనే చెల్లించాలని మార్కెట్ యాజమాన్యాన్ని డిమాండ్ చేశారు. రెండు, మూడు రోజుల్లోగా కార్మికుల బకాయి జీతాలను చెల్లించకపోతే, కార్మికులతో కలిసి మార్కెట్ ఎదుట పెద్ద ఎత్తున ధర్నా నిర్వహిస్తామని మార్కెట్ యాజమాన్యాన్ని హెచ్చరించారు. కార్మికుల సమస్యను ప్రభుత్వం, మార్కెట్ అధికారులు తక్షణమే పరిష్కరించి, బకాయి జీతాలను చెల్లించాలని ఆయన డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సమీకృత మార్కెట్‌లో పనిచేస్తున్న కార్మికులతో పాటు బీజేపీ సీనియర్ నాయకులు ఐల మహేందర్, బీజేవైఎం నాయకులు గడియారం రాజేశ్వర్ చారి తదితరులు పాల్గొన్నారు.



# మెడికల్ ఎంప్లాయిస్ యూనియన్, సమావేశం





**సంగారెడ్డి, సెప్టెంబర్ 11, (సిరిన్యూస్):**

సంగారెడ్డి జిల్లా పబ్లిక్ హెల్త్, మెడికల్ ఎంప్లాయీస్ యూనియన్ (INTUC3194) తో శుక్రవారం నాడు గ్రీవెన్స్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా పలు సమస్యలను జిల్లా అధికారులకు యూనియన్ నేతలు వివ రించారు. సంగారెడ్డి జిల్లా శాఖ ఈ రోజు డాక్టర్ లలిత దేవి గారితో జరిగిన ఈ సమావేశంలో పలు కీలక నిర్ణయాలు తీసుకున్నారు. ఈ సమావేశంలో పలు సమస్యలపై చర్చించారు. అన్ని సమస్యల పట్ల జిల్లా అధికారిణి సానుకూలంగా స్పందించారని యూనియన్ నాయకులు తెలిపారు. ఈ క్రింది సమస్యల పై సమా వేశంలో చర్చించారు. ఆరోగ్య శాఖ లో రెగ్యులర్ రిక్రూట్మెంట్ కావడం వలన పలు ఖాళీలు ఏర్పడి, ఉన్న సిబ్బంది కీ పని తీవ్రత పెరిగిందన్నారు. కావున నర్సింగ్ సిబ్బందిని, కాంటీజెంట్ సిబ్బందిని కాంట్రాక్టు ప్రాతిపదికన నియించాలని వారు డిమాండ్ చేశారు ఆశాలు, ఏ ఎన్ ఏం ల ఏర్పడిన ఖాళీలను వెంటనే భర్తీ చేయాలని కోరారు. అలాగే ఎం పీ ఎచ్ ఏ (ఫీమేల్) లకు అందరికి అడిషనల్ ఎచ్ ఆర్ ఏ ఇవ్వాలని వారు కోరారు. వైద్య, ఆరోగ్య శాఖ లో సిటిజెన్ చార్టర్ పాటించి ఫైల్స్ ను త్వరగా క్లియర్ చేయాలన్నారు.

మీ ప్రమాణం అటెండెన్స్ నుండి ఫీల్డ్ స్టాఫ్ కీ మినహాయింపు ఇవ్వాలని విజ్ఞప్తి చేశారు. జెచార్టర్ ఏ సి బడ్జెట్ లో ఏ ఎన్ ఏం /ఏం పీ ఎచ్ ఏ (ఫీమేల్) లను పరిగణలోకి తీసుకొని బడ్జెట్ ఖర్చు చేయాలన్నారు. ప్రతి ప్రభుత్వ ఉద్యోగి సర్వీస్ మ్యాటర్స్ ను ఎప్పటికప్పుడు సర్వీస్ రిజిస్టర్ లో నమోదు చేసి ఉద్యోగికి తెలియ చేయాలన్నారు. జీతం తో పాటు ఎఫ్ టీ ఏ చెల్లించాలన్నారు. ప్రతి ఉద్యోగి కీ రావలసిన అర్థిక పరమైన అంశాలను జాప్యం చేయకుండ ఇప్పించాలని విజ్ఞప్తి చేశారు. ఈ గ్రీవన్సెస్ మీటింగ్ లో యూనియన్ జిల్లా అధ్యక్షులు ఎస్ గుండయ్య, జిల్లా కార్యదర్శి ఈర్న భాస్కర్ రావు, సభ్యులు జొన్నాడ మల్లేశం, సుగుణాకర్, ప్రభాకర్, మంగమ్మ, వినోద, పద్మ, వసంత జ్యోతి తదితరులు పాల్గొన్నారు.

# మా సమస్యలపైనే ఫిర్యాదు చేయాల్సి వచ్చింది

**మొదటిపేజీ తరువాయి**

ఇంద్రారెడ్డి ఆవేదన వ్యక్తం చేశారు. అందరూ చూస్తుండగా నడిరోడ్డుపై ప్రజాప్రతినిధులమని కూడా చూడకుండా తన గొంతు నులమగా, సహచర ఎమ్మెల్యే చీర లాగి అత్యంత అవమానానికి గురిచేశారని కన్నీటిపర్యంతమయ్యారు. అసెంబ్లీ ప్రాంగణంలో తమ మహిళా ఎమ్మెల్యేలపై జరిగిన దాడి, పోలీసులు వ్యవహరించిన తీరుపై బీఆర్ఎస్ దిల్లీ వేదికగా పోరును ముమ్మరం చేసింది. మహిళా ప్రజాప్రతినిధులపై పోలీసుల దురుసు ప్రవర్తన, తమను అసెంబ్లీలోకి వెళ్లకుండా అడ్డుకోవడం, శాసనసభ్యుల హక్కులకు భంగం కలిగించడంపై బీఆర్ఎస్ ప్రతినిధి బృందం శుక్రవారం జాతీయ మహిళా కమిషన్, జాతీయ మానవ హక్కుల కమిషన్‌ను ఆశ్రయించింది. ఎమ్మెల్యేలు సబితా ఇంద్రారెడ్డి, సునీత లక్ష్మారెడ్డి మహిళా కమిషన్ చైర్‌పర్సన్ విజయ రహట్కర్‌ను కలిసి ఘటనకు సంబంధించిన వివరాలను వెల్లడించారు. అనంతరం జాతీయ మానవ హక్కుల కమిషన్ సభ్యురాలు విజయ భారతిని కలిసి ఫిర్యాదు చేశారు. మహిళా ఎమ్మెల్యేలు అసెంబ్లీలోకి వెళ్లకుండా అడ్డుకోవడం, పోలీసుల చేత అవమానించడం, శాసనసభ్యులుగా తమ హక్కులకు విఘాతం కలిగించేలా వ్యవహరించడం వంటి అంశాలను కమిషన్ల దృష్టికి తీసుకెళ్లారు. పోలీసుల దాడులపై స్పందించాల్సిన ప్రభుత్వ పెద్దలు మౌనంగా ఉంటున్నారని మండిపడ్డారు. అసెంబ్లీ ప్రాంగణంలో జరిగిన ఘటనలకు సంబంధించిన అన్ని సీసీటీవీ ఫుటేజీలను భద్రపరిచేలా ఆదేశాలు ఇవ్వాలని, ఘటనపై సమగ్ర విచారణ జరిపి బాధ్యులపై చర్యలు తీసుకోవాలని బీఆర్ఎస్ నేతలు కోరారు. మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్‌కు తగిన రక్షణ కల్పించేలా చర్యలు తీసుకోవాలని కూడా విజ్ఞప్తి చేశారు. తక్షణం డీజీపీని నివేదిక కోరతామని మహిళా కమిషన్ చైర్ పర్సన్ హామీ ఇచ్చారు. అనంతరం మీడియా సమావేశంలో మాట్లాడుతూ తమకు అవమానం జరిగిందని సబితా ఇంద్రారెడ్డి తీవ్ర ఆవేదన వ్యక్తం చేశారు. రాష్ట్రంలో నాలుగు రోజులుగా జరుగుతున్న పరిణామాలను దేశం మొత్తం గమనిస్తోందన్నారు. అసెంబ్లీ సమావేశాలకు ముందు సమస్యలపై సభలో చర్చ జరగాలని ముఖ్యమంత్రి చెప్పారని, అయితే సమావేశాల ప్రారంభ రోజునే తమను అసెంబ్లీలోకి వెళ్లకుండా పోలీసులు అడ్డుకున్నారని తెలిపారు. అమరవీరుల స్తూపం వద్ద నివాళులర్పించాక అసెంబ్లీలో అడుగుపెట్టకముందే పోలీసులు తమను నిలువరించారని చెప్పారు. నల్ల దుస్తులు ధరించడాన్ని కారణంగా చూపి అడ్డుకున్నారని, అయితే తమ దుస్తులపై ఎలాంటి అభ్యంతరకరమైన రాతలు లేవని స్పష్టం చేశారు. తమను అసెంబ్లీలోకి వెళ్లకుండా అడ్డుకునే అధికారం పోలీసులకు ఎవరు ఇచ్చారు అని ప్రశ్నించారు. మహిళా ఎమ్మెల్యేల పట్ల పురుష పోలీసులు వ్యవహరించిన తీరు తీవ్రంగా అవమానకరంగా ఉందని, చీర, జుట్టు పట్టుకుని లాగారని, ఇతర ఎమ్మెల్యేలను కింద పడేసి తొక్కారని ఆరోపించారు. అసెంబ్లీ ప్రాంగణంలో మహిళా ప్రజాప్రతినిధుల పట్ల ఇలాంటి ఘటన జరగడం అత్యంత దురదృష్టకరమన్నారు. 'మా మనసులు గాయపడ్డాయి.. భారమైన గుండెలతో మాట్లాడుతున్నాం.. మహిళలుగా మాకు అవమానం జరిగింది.. శాసనసభ్యులుగా మా హక్కులకు భంగం కలిగింది' అని సబిత ఆవేదన వ్యక్తం చేశారు. తమపై దాడి జరిగి వంద గంటలు దాటినా కనీసం ఎఫ్ఐఆర్ కూడా నమోదు చేయలేదని ఆరోపించారు. మరోవైపు తమపైనే కేసులు నమోదు చేయడం రాజకీయ నాటకమని విమర్శించారు. రాష్ట్రంలో ఎక్కడ ఫిర్యాదు చేసినా న్యాయం జరగనందునే దిల్లీకి వచ్చామని తెలిపారు.

**మా సమస్యలపై ఫిర్యాదు చేయాల్సి వచ్చింది**

సునీత లక్ష్మారెడ్డి మాట్లాడుతూ శాసనసభ్యులపై ప్రభుత్వం వ్యవహరించిన తీరును పూర్తి వివరాలతో జాతీయ కమిషన్లకు ఫిర్యాదు చేశామని తెలిపారు. ప్రజల సమస్యలను సభలో ప్రస్తావించాల్సిన తాము ఇప్పుడు తమపై జరిగిన దాడి గురించి మాట్లాడాల్సిన పరిస్థితి రావడం అత్యంత దారుణమని అన్నారు. 'ప్రజా సమస్యలపై మా గొంతు వినడానికి ప్రభుత్వం సిద్ధంగా లేదు.. అందుకే మమ్మల్ని అసెంబ్లీకి రాకుండా అడ్డుకుంటున్నారు.. రాష్ట్రంలో న్యాయం జరగలేదని భావించి దిల్లీకి వచ్చాం' అని సునీత అన్నారు. మహిళా ఎమ్మెల్యేలపై దాడి చేయించి తిరిగి తమపైనే కేసులు నమోదు చేయడం బాధాకరమన్నారు. తమకు జరిగిన అవమానంపై అసెంబ్లీలో మాట్లాడే అవకాశం కూడా ఇవ్వలేదని, స్పీకర్ స్పందించి ఉంటే ఆయనకు చేతులెత్తి నమస్కరించేవాళ్లమని అన్నారు.

**పథకం ప్రకారమే అడ్డుకున్నారు : జగదీశ్‌రెడ్డి**

ఎమ్మెల్యే జగదీశ్‌రెడ్డి మాట్లాడుతూ అసెంబ్లీ సమావేశాలు ప్రారంభమైన తర్వాత జరుగుతున్న అప్రజాస్వామిక ఘటనలను రాష్ట్ర ప్రజలతోపాటు దేశం మొత్తం చూస్తోందన్నారు. ప్రధాన ప్రతిపక్షమైన బీఆర్ఎస్‌ను శాసనసభకు రాకుండా పథకం ప్రకారం అడ్డుకున్నారని ఆరోపించారు. మహిళా ప్రజాప్రతినిధులపై దాడులు చేయించడం ద్వారా ప్రజాస్వామ్యానికి మాయని మచ్చలా వ్యవహరించారన్నారు. తమ ఎమ్మెల్యేలపై భౌతిక దాడులకు పాల్పడ్డారని, హైకోర్టు ఉత్తర్వులు ఉన్నా తమపై కేసులు పెట్టారని ఆరోపించారు. ఎమర్జెన్సీ రోజులను తలపించేలా కాంగ్రెస్ ప్రభుత్వ నైజం బయటపడుతోందని ఆయన విమర్శించారు. అధికారులు పూర్తిగా ముఖ్యమంత్రి, మంత్రుల కనుసన్నల్లో పనిచేస్తున్నారని ఆరోపించారు. మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ ఇంటిపై దాడికి పెద్ద సంఖ్యలో వ్యక్తులను ఉసిగొల్పి ఎస్కార్ట్ ఇచ్చి పంపారని ఆరోపించారు. కేసీఆర్ ఇంటి వద్దకు వెళ్లిన తమ ఎమ్మెల్యేలను అరెస్టు చేశారన్నారు. మహిళా ప్రజాప్రతినిధులను అడ్డుకునేందుకు పురుష పోలీసులను, పురుష ప్రజాప్రతినిధులను అడ్డుకునేందుకు మహిళా పోలీసులను ఉపయోగించడం శిఖండి రాజకీయాలకు నిదర్శనమని విమర్శించారు.

**ప్రభుత్వాన్ని ప్రశ్నిస్తారని భయపడి సస్పెండ్ చేశారు : పల్లా**

ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డి మాట్లాడుతూ రాష్ట్రంలో నాలుగు రోజులుగా హైడ్రామా జరుగుతోందన్నారు. అన్ని అంశాలపై చర్చకు సిద్ధమని ప్రభుత్వం చెబుతున్నప్పటికీ సభను కొద్ది రోజులకే పరిమితం చేసి ప్రతిపక్ష సభ్యులను సభకు రాకుండా చేశారని విమర్శించారు. భూ కుంభకోణాలు, విద్యార్థుల ఫీజు రీయింబర్స్‌మెంట్, ప్రభుత్వ వైఫల్యాలు సహా అన్ని అంశాలపై బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు ప్రభుత్వాన్ని నిలదీస్తారని, సమాధానం చెప్పలేకనే కుట్రపూరితంగా తమను సస్పెండ్ చేసినట్లు ఆరోపించారు. మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ ఇంటిపై దాడికి ఎమ్మెల్యేలు, విప్‌లను పంపి ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి రాజకీయంగా రాక్షసానందం పొందారని ఆరోపించారు. కాంగ్రెస్‌కు పతనం దగ్గరపడిందని వ్యాఖ్యానించారు.

**రేవంత్ దాష్టీకాలను రాహుల్ కట్టడి చేస్తారా? : ఎంపీ వద్దిరాజు**

ఎంపీ వద్దిరాజు రవిచంద్ర మాట్లాడుతూ రాష్ట్రంలోని పరిణామాలపై కాంగ్రెస్ అగ్రనాయకత్వం స్పందించాలని డిమాండ్ చేశారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి తీరుపై సోనియా, రాహుల్ గాంధీలకు లేఖలు రాశామని తెలిపారు. రేవంత్‌రెడ్డి చేస్తున్న దాష్టీకాలను రాహుల్ గాంధీ కట్టడి చేస్తారా లేదా అని ఆయన ప్రశ్నించారు. ప్రజల తరఫున ప్రశ్నించే ప్రతిపక్ష హక్కును ప్రభుత్వం కాలరాస్తోందని ఆరోపించారు. మహిళా ప్రజాప్రతినిధుల గౌరవం, శాసనసభ్యుల హక్కులను కాపాడాలని కోరారు. కమిషన్ల సభ్యులను కలిసిన వారిలో ఎమ్మెల్యేలు కోవ లక్ష్మి దివికొండ దామోదర్ రావు, ఎమ్మెల్సీ వాణిదేవి, మాజీ మంత్రి సత్యవతి రాథోడ్, బీఆర్ఎస్ లీగల్ సెల్ బృందం నుంచి బీఎస్ ప్రసాద్, సోమా భరత్, లలితా రెడ్డి తదితరులు కూడా ఉన్నారు.

# విమోచన దినాన్ని కనుమరుగు చేస్తున్న ప్రభుత్వం

**హైదరాబాద్, సెప్టెంబర్ 11:**

దేశమంతా 1947 ఆగస్టు 15న స్వాతంత్ర్య సంబరాలు జరుపుకుంటే నాటి హైదరాబాద్ సంస్థానంలోని తెలంగాణ గడ్డ మాత్రం ఆ వేడుకల్లో పాల్గొనే పరిస్థితి లేకుండా నిజాం రాచరిక సంకెళ్లలో, రజాకార్ల ఆగడాలకు గురై మరో 13 నెలల పాటు నరకయాతన అనుభవించిందని బీజేపీ రాజ్యసభ సభ్యులు డాక్టర్ కె.లక్ష్మణ్ గుర్తుచేశారు. నేటి యువతరానికి, జెన్‌జీ, జెన్‌ఆల్ఫా తరాలకు దేశానికి స్వాతంత్ర్యం ఎప్పుడు వచ్చిందంటే ఆగస్టు 15 అని మాత్రమే తెలుసని, నాటి పరిస్థితుల్లో తెలంగాణ అందులో భాగస్వామి కాలేదన్న చేదు నిజాన్ని చాలామంది గ్రహించలేకపోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. బీజేపీ కార్యాలయంలో మీడియా సమావేశంలో ఆయన ఈ చారిత్రక ఘట్టాలు, రాజకీయ పరిస్థితులపై మాట్లాడారు. దేశం స్వతంత్రమైన వేళ హైదరాబాద్ సంస్థానాన్ని భారత్ లో విలీనం చేయకుండా ఒక ప్రత్యేక దేశంగానో లేదా ఇస్లామిక్ రాజ్యంగానో మార్చాలని నిజాం కుట్రలు పన్నారని మండిపడ్డారు. ఖాసిం రజ్వీ నేతృత్వంలోని నిజాం ప్రైవేట్ సైన్యం రజాకార్లు దాదాపు 13 నెలల పాటు సాగించిన కిరాతక మారణకాండలో తెలంగాణ ప్రజలు తీవ్ర చిత్రహింసలు అనుభవించారని, ఈ చరిత్రను ఆనాటి కాంగ్రెస్ పార్టీ కాలగర్భంలో తొక్కివేసిందని ఆరోపించారు. ఉక్కు మనిషి సర్దార్ వల్లభాయ్ పటేల్ దృఢ సంకల్పంతో ముందుకొచ్చి దేశ కడుపులో ఏర్పడ 'క్యాన్సర్ కణితి'ని శస్త్రచికిత్స చేసి తొలగించాల్సిందేనని పట్టుబట్టి 1948 సెప్టెంబర్ 13న ఆపరేషన్ పోలో'కు ఆదేశాలు ఇచ్చి భారత సైన్యాన్ని పంపించారని, సైన్యం ధాటికి తలొగ్గి సెప్టెంబర్ 17న నిజాం సైన్యం లొంగిపోయి సంస్థానాన్ని భారత్ లో విలీనం చేసిందని స్పష్టం చేశారు. హైదరాబాద్ సంస్థాన పరిధిలో ఉన్న మహారాష్ట్ర, కర్ణాటక జిల్లాల్లో సెప్టెంబర్ 17ను అక్కడి ప్రభుత్వాలు అధికారికంగా విమోచన దినోత్సవంగా జరుపుతుంటే తెలంగాణలో మాత్రం ఎందుకు జరపడం లేదని ఆయన నిలదీశారు. అక్కడ లేని ఎంఐఎం ఇక్కడ ఉండటమే దీనికి ప్రధానా కారణమని ఆరోపించారు. మలిదశ ఉద్యమంలో నాటి రోశయ్య ప్రభుత్వాన్ని ప్రశ్నిస్తూ సెప్టెంబర్ 17 అధికారికంగా నిర్వహించకపోతే ప్రభుత్వాన్ని కుప్పకూలుస్తామని హెచ్చరించిన కేసీఆర్ అధికారంలోకి వచ్చాక అసెంబ్లీలో తాను ప్రస్తావిస్తే ఊసరవెల్లిలా రంగులు మార్చి జరిపే ప్రసక్తే లేదు అని మడమ తిప్పారని విమర్శించారు. "కారు ప్రభుత్వం నడిపితే, స్టీరింగ్ నా చేతుల్లో ఉంది" అని ఆనాడు అసదుద్దీన్ ఒవైసీ మాటలను గుర్తుచేస్తూ.. మజ్లిస్ కు తొత్తులుగా మారి తెలంగాణ ఏర్పాటును వ్యతిరేకించిన వారికే కొమ్ముకాశారని విరుచుకుపడ్డారు. ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం రేవంత్ రెడ్డి సైతం అదే బాటలో నడుస్తూ 'ప్రజాపాలన' పేరిట పేరిట విమోచన దినోత్సవ ప్రాధాన్యతను కనుమరుగు చేసి మైనారిటీల బుజ్జగింపు రాజకీయాలు చేస్తున్నారని లక్ష్మణ్ విమర్శించారు.



# డిలిమిటేషన్ బిల్లుపై కేంద్రం కసరత్తు

- మహిళా రిజర్వేషన్‌పైనా ప్రత్యేక సమావేశం?
- బ్రిక్స్ భేటీ తర్వాత నిర్ణయం వెలువడే అవకాశం
- నవరాత్రుల్లో పార్లమెంట్ సమావేశాలపై ఊహాగానాలు
- ప్రత్యేక సమావేశాలపై అధికారిక ప్రకటన లేని కేంద్రం
- వర్షాకాల సమావేశాల తీరుపై జైరాం రమేష్ విమర్శలు

**న్యూఢిల్లీ, సెప్టెంబరు 12:**

నియోజకవర్గాల పునర్వ్యవస్థీకరణ (డిలిమిటేషన్) బిల్లు, మహిళా రిజర్వేషన్ బిల్లును ప్రవేశపెట్టేందుకు కేంద్రం సిద్ధమవుతున్నట్లు తెలుస్తోంది. పార్లమెంట్ వర్షాకాల సమావేశాలను అధికారికంగా వాయిదా వేయకపోవడంతో ప్రత్యేక సమావేశాలు నిర్వహించే అవకాశం ఉందన్న చర్చ మొదలైంది. అయితే దీనిపై కేంద్రం ఇప్పటి వరకు ఎలాంటి అధికారిక ప్రకటన చేయలేదు.

**బ్రిక్స్ భేటీ తర్వాత నిర్ణయం**

బ్రిక్స్ సమావేశాల అనంతరం ప్రత్యేక పార్లమెంట్ సమావేశాలపై కేంద్రం నిర్ణయం తీసుకునే అవకాశం ఉన్నట్లు సమాచారం. నవరాత్రుల సమయంలో సమావేశాలు నిర్వహించే అవకాశంపై ఊహాగానాలు వినిపిస్తున్నాయి. ప్రత్యేక సమావేశాలు ఏర్పాటు చేయాలా? వద్దా? అనే అంశంపై బ్రిక్స్ భేటీ తర్వాత స్పష్టత వచ్చే అవకాశం ఉంది.

**జైరాం రమేష్ విమర్శలు**

వర్షాకాల సమావేశాలు ముగిసి 29 రోజులు గడిచినా పార్లమెంట్‌ను అధికారికంగా వాయిదా వేయకపోవడంపై కాంగ్రెస్ నేత జైరాం రమేష్ ప్రశ్నించారు. ప్రభుత్వం తన సొంత రికార్డును తానే బద్ధలు కొడుతోందని ఎద్దేవా చేశారు. ప్రతిపక్షాన్ని భయపెట్టాలనే ఉద్దేశంతోనే ఇలా వ్యవహరిస్తోందని, అయితే ఆ ప్రయత్నం ఫలించలేదని అన్నారు. ఇటీవల ముగిసిన వర్షాకాల సమావేశాల్లో తీవ్ర గందరగోళం నెలకొంది. రోజుకు ఆరు గంటల చొప్పున 15 రోజులు సమావేశాలు జరగాల్సి ఉండగా.. లోక్‌సభ కేవలం 15 గంటల 36 నిమిషాలు, రాజ్యసభ 24 గంటల 21 నిమిషాలు మాత్రమే పనిచేశాయి. జంతర్‌మంతర్ నిరసనలు, విద్యార్థుల సమస్యలు, వారిపై పోలీసులు బలప్రయోగం చేశారన్న ఆరోపణలపై కాంగ్రెస్‌తో పాటు ఇతర ప్రతిపక్షాలు సభలో ఆందోళన చేపట్టాయి.

# హోర్ముజ్‌పై ఇరాన్‌తో చర్చలకు గల్ఫ్ దేశాలు?

- బ్రిక్స్ భేటీ తర్వాత సమావేశంపై నిర్ణయం
- సలాలాలో సోమవారం భేటీకి యోచన
- హౌతీల దూకుడుతో బాబ్ అల్ మందబ్‌పై ఆందోళన

**దుబాయ్, సెప్టెంబరు 12:**

హోర్ముజ్ జలసంధి భవిష్యత్తుపై ఇరాన్‌తో చర్చలు జరిపే అంశాన్ని గల్ఫ్ దేశాలు పరిశీలిస్తున్నట్లు సమాచారం. అమెరికా-ఇరాన్ ఘర్షణలు, యెమెన్‌లో హౌతీల దూకుడుతో సముద్ర మార్గాల్లో అంతరాయాలు పెరుగుతున్న నేపథ్యంలో ఈ చర్చలకు ప్రాధాన్యం ఏర్పడింది. అయితే ప్రత్యేక సమావేశంపై ఇప్పటివరకు అధికారిక ప్రకటన వెలువడలేదు.

**సలాలాలో భేటీకి యోచన**

ఆరు దేశాల గల్ఫ్ కోఆపరేషన్ కౌన్సిల్ (GCC) ప్రతినిధులు, ఇరాన్ అధికారులతో సోమవారం దక్షిణ ఒమన్‌లోని సలాలాలో సమావేశమయ్యే అవకాశం ఉన్నట్లు తెలుస్తోంది. ఒమన్ ఈ భేటీకి ఏర్పాట్లు చేస్తున్నట్లు సమాచారం. అయితే సమావేశం ఖరారుపై స్పష్టత లేదు. ఇరాన్ విదేశాంగ శాఖ అధికార ప్రతినిధి ఇస్మాయిల్ బఘాయీ కూడా సమావేశానికి ఏర్పాట్లు జరుగుతున్నట్లు తెలిపారు. హోర్ముజ్‌పై ఇరాన్-ఒమన్ చర్చల ఫలితాలపై భేటీలో చర్చించనున్నట్లు వెల్లడించారు.

**హౌతీల దూకుడుతో ఆందోళన**

యెమెన్‌లోని హౌతీలు బాబ్ అల్ మందబ్ జలసంధికి సమీపంలోని ఎర్ర సముద్ర తీర ప్రాంతాల వైపు ముందుకు సాగుతున్నట్లు సమాచారం. దీంతో ప్రపంచ వాణిజ్యానికి కీలకమైన ఈ మార్గంలో అంతరాయాలపై ఆందోళనలు పెరుగుతున్నాయి. హోర్ముజ్‌తో పాటు బాబ్ అల్ మందబ్‌లోనూ నౌకాయానానికి ఆటంకాలు ఏర్పడితే చమురు మార్కెట్లపై ఒత్తిడి మరింత పెరిగే అవకాశం ఉంది. హోర్ముజ్‌పై నియంత్రణ విషయంలో ఇరాన్ వెనక్కి తగ్గడం లేదు. ఒమన్‌తో సముద్ర రవాణాకు సంబంధించిన విధివిధానాలపై చర్చలు జరుపుతున్నట్లు తెలుస్తోంది. హోర్ముజ్ గుండా వెళ్లే నౌకల నుంచి రుసుము వసూలు చేసే ప్రతిపాదన ఉండే అవకాశం ఉన్నట్లు సమాచారం. దీనిని అమెరికా, గల్ఫ్ దేశాలు వ్యతిరేకిస్తున్నాయి.

**చమురు ధరలపై ప్రభావం**

హోర్ముజ్ సంక్షోభంతో సౌదీ అరేబియా, యూఏఈ ప్రత్యామ్నాయ మార్గాల ద్వారా కొంత చమురును ఎగుమతి చేస్తున్నాయి. అయినప్పటికీ రవాణా అంతరాయాలు ఆర్థిక వ్యవస్థలపై ప్రభావం చూపుతున్నాయి. ఈ వారం చమురు ధరలు భారీగా పెరగగా.. శుక్రవారం బ్రెంట్ క్రూడ్ 3 శాతానికి పైగా తగ్గి బ్యారెల్‌కు సుమారు 104 డాలర్ల వద్ద ట్రేడైంది. అమెరికా-ఇరాన్ యుద్ధం మరికొన్ని నెలలు కొనసాగే అవకాశం ఉందని బ్లూమ్‌బర్గ్ నివేదించింది.

# కీలక ఖనిజాల్లో స్వయం సమృద్ధే లక్ష్యం

- రూ.36 వేల కోట్లతో నేషనల్ క్రిటికల్ మినరల్ మిషన్
- ఈ-వ్యర్థాల నుంచి 30 శాతం అవసరాలు తీర్చే అవకాశం
- 58 రీసైక్లింగ్ కంపెనీలతో ప్రత్యేక కార్యక్రమాలు
- లిథియం కోసం అర్జెంటీనా, ఆస్ట్రేలియా, చిలీతో చర్చలు
- బ్రిక్స్ సదస్సులో కీలక ఖనిజాలపై చర్చ




**న్యూఢిల్లీ, సెప్టెంబరు 11:**

క్రిటికల్ మినరల్స్ (కీలక ఖనిజాలు) రంగం భారత్‌తో పాటు ప్రపంచానికి అత్యంత కీలకమని కేంద్ర బొగ్గు, గనుల శాఖ మంత్రి కిషన్‌రెడ్డి అన్నారు. మొబైల్ ఫోన్లు, అంతరిక్ష సాంకేతికత, ఎలక్ట్రానిక్స్ సహా ఆధునిక రంగాలన్నింటికీ ఇవి అవసరమని తెలిపారు. విదేశాలపై ఆధారపడటాన్ని తగ్గించి దేశాన్ని స్వయం సమృద్ధిగా మార్చేందుకు దేశీయ అన్వేషణను వేగవంతం చేస్తున్నామని చెప్పారు. ఇందులో భాగంగా రూ.36 వేల కోట్ల ప్రోత్సాహక పథకంతో నేషనల్ క్రిటికల్ మినరల్ మిషన్ ప్రారంభించినట్లు వెల్లడించారు.

**ఈ-వ్యర్థాల రీసైక్లింగ్‌పై దృష్టి**

అర్బన్ మైనింగ్ ద్వారా దేశ అవసరాల్లో 25 నుంచి 30 శాతం కీలక ఖనిజాలను సమకూర్చుకునే అవకాశం ఉందని కిషన్‌రెడ్డి తెలిపారు. ఇందుకోసం 58 రీసైక్లింగ్ కంపెనీలతో ప్రత్యేక కార్యక్రమాలు చేపడుతున్నట్లు చెప్పారు. ఒడిశా, ఆంధ్రప్రదేశ్, తమిళనాడు మీదుగా కేరళ వరకు క్రిటికల్ మినరల్ కారిడార్‌తో పాటు నాలుగు ప్రాసెసింగ్ ప్లాంట్లను ఏర్పాటు చేస్తున్నామని వివరించారు. రాబోయే బ్రిక్స్ సదస్సులోనూ ఈ అంశంపై చర్చిస్తామని తెలిపారు.

**లిథియం కోసం విదేశాల్లో అన్వేషణ**

దేశంలో లిథియం నిల్వలు పరిమితంగా ఉన్న నేపథ్యంలో విదేశాల్లో వనరుల సమీకరణకు వ్యూహాత్మక చర్యలు చేపడుతున్నామని మంత్రి వెల్లడించారు. అర్జెంటీనాలో ఇప్పటికే ఐదు లిథియం బ్లాకులను దక్కించుకుని అన్వేషణ ప్రారంభించామని, మరో ఐదు బ్లాకుల కోసం చర్చలు జరుగుతున్నాయని చెప్పారు. ఆస్ట్రేలియా, చిలీతోనూ సంప్రదింపులు కొనసాగుతున్నాయని తెలిపారు.

# ఫాస్టాగ్ బ్యాంక్ మార్చుకోవడం ఇక ఈజీ

- పాత ట్యాగ్‌తోనే కొత్త ఖాతాకు అనుసంధానం
- 'రాజమార్గయాత్ర' యాప్‌లో 'OneTag' సదుపాయం
- డీయాక్టివేట్ చేసి కొత్త ట్యాగ్ కొనాల్సిన అవసరం లేదు
- వాహనదారులకు మరింత సులభతరం కానున్న టోల్ చెల్లింపులు

**న్యూఢిల్లీ, సెప్టెంబరు 12:**

టోల్ ప్లాజాల వద్ద వాహనదారుల ప్రయాణాలను మరింత సులభతరం చేసేందుకు భారత జాతీయ రహదారుల ప్రాధికార సంస్థ (NHAI) ఫాస్టాగ్ బ్యాంక్ అకౌంట్ పోర్టబిలిటీ సదుపాయాన్ని ప్రారంభించింది. ఇకపై ఫాస్టాగ్‌ను డీయాక్టివేట్ చేయకుండానే అనుసంధానమైన బ్యాంక్ ఖాతాను మార్చుకునే వెసులుబాటు కలగనుంది. గతంలో బ్యాంక్ ఖాతాలో సాంకేతిక సమస్యలు తలెత్తినా, ఖాతా మార్చుకోవాలనుకున్నా.. ఉన్న ఫాస్టాగ్‌ను డీయాక్టివేట్ చేసి, కొత్త బ్యాంక్ ద్వారా మరో ట్యాగ్ కొనుగోలు చేయాల్సి వచ్చేది. దీంతో వాహనదారులకు సమయం, నగదు వృథా కావడంతో పాటు ఇబ్బందులు ఎదురయ్యేవి.

**'OneTag'తో డిజిటల్‌గా మార్పు**

ఎన్‌హెచ్‌ఏఐ అధికారిక 'రాజమార్గయాత్ర' (Rajmargyatra) మొబైల్ యాప్‌లోని 'OneTag' ఫీచర్ ద్వారా ఈ సదుపాయం అందుబాటులోకి వచ్చింది. వినియోగదారులు తమ పాత ఫాస్టాగ్‌ను యథాతథంగా ఉంచుకుంటూనే, నచ్చిన మరో బ్యాంక్ ఖాతాకు అనుసంధానించుకోవచ్చు. వాహనంపై ఉన్న స్టిక్కర్‌ను మార్చాల్సిన అవసరం లేకుండా కేవలం డిజిటల్ పద్ధతిలో బ్యాంక్ ఖాతాను అప్‌డేట్ చేసుకునే అవకాశం కల్పించారు.



# జూ. ఎన్టీఆర్ డాన్స్ అంటే ఇష్టం

ఒకప్పుడు తన అందంతో కుర్రాళ్లను కవ్వించిన భామల్లో రంభ ఒకరు. ఆమె అందం నటన ప్రేక్షకులను విపరీతంగా ఆకట్టుకుంది. అప్పట్లో స్టార్ హీరోల సరసన నటించింది మిప్పించింది. తన అందంతో ఇండస్ట్రీని ఊపేసింది. సినిమాలో హీరోయిన్ గా చేస్తూనే మరో వైపు స్పెషల్ సాంగ్స్ లోనూ మెప్పించింది రంభ. అందం అభినయంతో ఉర్రుతలూగించిన రంభ ప్రస్తుతం సినిమాలకు దూరంగా ఉంటున్నారు. రంభ గతంలో ఓ ఇంటర్వ్యూలో చేసిన కామెంట్స్ ఇప్పుడు మరోసారి వైరల్ అవుతున్నాయి. ఈ ఇంటర్వ్యూలో తన కెరీర్, వ్యక్తిగత జీవితానికి సంబంధించిన పలు ఆసక్తికర విషయాలను ప్రేక్షకులతో పంచుకున్నారు. అలాగే జూనియర్ ఎన్టీఆర్ గురించి కొన్ని ఆసక్తికర కామెంట్స్ చేశారు రంభ. యంగ్ టైగర్ జూనియర్ ఎన్టీఆర్ క్రేజ్ గురించి ప్రత్యేకంగా చెప్పాల్సిన పనిలేదు. మొన్నటి వరకు టాలీవుడ్ స్టార్ హీరోగా రాణించిన తారక్, ట్రిపుల్ ఆర్ సినిమాతో పాన్ ఇండియా స్టార్‌గా ఎదిగారు. ఇప్పుడు తారక్‌కు ప్రపంచవ్యాప్తంగా అభిమానులున్నారు. ఆయన డాన్స్‌లకు సపరేట్ ఫ్యాన్ ఫాలోయింగ్ ఉంది. టాలీవుడ్‌లో బెస్ట్ డాన్సర్ ఎవరంటే ఎన్టీఆర్ పేరే చెబుతారు. ఎన్టీఆర్ డాన్స్ గురించి ఇప్పటికే చాలామంది సెలబ్రిటీలు ప్రశంసించారు. అలాగే నటి రంభ కూడా తారక్ డాన్స్ పై ఆసక్తికర వ్యాఖ్యలు చేసింది. ఆమె ఓ ఇంటర్వ్యూలో మాట్లాడుతూ, జూనియర్ ఎన్టీఆర్ నటన అంటే ఎంతో ఇష్టమని తెలిపింది. తాను చేసిన ఐటెం సాంగ్స్ లో నాచోరే నాచోరే సాంగ్ అంటే ఇష్టమని రంభ చెప్పింది. ఎన్టీఆర్ డాన్స్ చేస్తే కన్నార్పకుండా చూస్తామని, ఆయన డెడికేషన్ చూస్తే పిచ్చెక్కుతుందని ఆమె పేర్కొంది. తన దృష్టిలో మైకేల్ జాక్సన్ కన్నా తారక్ బెస్ట్ డాన్సర్ అని రంభ ప్రశంసలతో ముంచెత్తింది. ఈ వ్యాఖ్యలు ఇప్పుడు సోషల్ మీడియాలో వైరల్ అవుతున్నాయి. రంభ మహేష్ బాబు, పవన్ కళ్యాణ్ లతో సినిమా చేయాలనే తన కోరికను కూడా బయటపెట్టింది.

# మహిళలే తాళి ఎందుకు ధరించాలి?




ఫస్ట్ మూవీ సొంతంతో సూపర్ సక్సెస్ అందుకున్న హీరోయిన్ నమిత... ఆ తర్వాత స్టార్ హీరోస్ సరసన నటించారు. పెళ్లి తర్వాత సినిమాలకు గ్యాప్ ఇచ్చారు. తాజాగా, ఓ ఇంటర్వ్యూలో పాల్గొన్న ఈమె... వివాహా సంప్రదాయాలు, మహిళలపై సమాజంలో మోపుతున్న బాధ్యతలు, వివక్షల గురించి ఇంట్రెస్టింగ్ కామెంట్స్ చేశారు. అసలు పురుషులకు లేని నిబంధనలు మహిళలకే ఎందుకని ప్రశ్నించారు నమిత. 'ఆడవాళ్లే ఎందుకు బొట్టు పెట్టుకోవాలి? మహిళలే తాళి ఎందుకు ధరించాలి? పురుషులకు లేని రూల్స్ మహిళలకే ఎందుకు?' అంటూ ప్రశ్నల వర్షం కురిపించారు. అలాగే, భర్త దీర్ఘాయుష్షు కోసం మహిళలు వరలక్ష్మి వ్రతం చేసే విధానంపైనా నమిత రియాక్ట్ అయ్యారు. నా భర్త సురక్షితంగా దీర్ఘాయుష్షుతో ఉండాలని నేను ఉపవాసం ఉంటాను. కానీ, నా భార్య క్షేమం కోసం భర్త కనీసం ఏడాదిలో ఒక్క రోజైనా కేటాయించాలనే రూల్ ఉందా? సమాజం ఎందుకు అలాంటివి క్రియేట్ చేయలేదు. కట్టు, బొట్టూ విషయంలో అన్నీ రూల్స్ మహిళలకే ఎందుకు? మహిళలు తాళి ధరించాలని ఏ గ్రంథాల్లోనూ లేదు. ఇవన్నీ సమాజం సృష్టించనవే. ఎందులోనూ ఇలాంటి నిబంధనలు లేవు.' అంటూ చెప్పారు. ప్రస్తుతం ఈ కామెంట్స్ సోషల్ మీడియాలో వైరల్ అవుతున్నాయి. 'సొంతం' సినిమాతో టాలీవుడ్?లోకి ఎంట్రీ ఇచ్చిన నమిత తనదైన అందం, నటనతో మంచి ఫేమ్ సంపాదించుకున్నారు. ఆ తర్వాత విక్టరీ వెంకటేశ్‌తో జెమినీ చేశారు. రవితేజ, బాలకృష్ణ, శ్రీకాంత్ వంటి స్టార్స్‌తో కలిసి నటించారు. తెలుగుతో పాటు తమిళం, కన్నడ, మలయాళ భాషల్లోనూ మూవీస్ చేశారు. 2017లో పెళ్లి తర్వాత సినిమాలకు దూరమయ్యారు. చివరగా 2020లో మియా అనే తమిళ మూవీలో నటించారు. రీసెంట్‌గా సోషల్ మీడియాలో యాక్టివ్ అవుతున్నారు. మళ్లీ ఆమె మూవీస్‌లో నటిస్తారనే ప్రచారం సాగుతోంది. అయితే, దీనిపై నమిత అఫీషియల్‌గా రియాక్ట్ కాలేదు.

# నేడు 'ఆదర్శ కుటుంబం' టీజర్ విడుదల




విక్టరీ వెంకటేష్, మాటల మాంత్రికుడు త్రివిక్రమ్ శ్రీనివాస్ కలయికలో వస్తున్న 'ఆదర్శ కుటుంబం' (హౌస్ నంబర్: 47) సినిమాపై అభిమానుల్లో భారీ అంచనాలు నెలకొన్నాయి. ఈ సినిమా కోసం ఎదురుచూస్తున్న వారికి చిత్ర యూనిట్ ఒక అదిరిపోయే అప్‌డేట్ ఇచ్చింది. ఈ మూవీ అధికారిక టీజర్‌ను శనివారం మధ్యాహ్నం 12 గంటలకు విడుదల చేయనున్నట్లు సోషల్ మీడియా ద్వారా అధికారికంగా ప్రకటించింది. ఈ చిత్రంలో వెంకటేష్ సరసన 'కేజీఎఫ్' ఫేమ్ శ్రీనిధి శెట్టి హీరోయిన్‌గా నటిస్తుండగా, నారా రోహిత్, నివేదా పేతురాజ్, రావు రమేశ్, వెన్నెల కిషోర్ వంటి ప్రముఖ నటులు కీలక పాత్రలు పోషిస్తున్నారు. ఈ సినిమాకు ఎస్.ఎస్. థమన్ సంగీతం అందిస్తున్నారు. గతంలో వెంకటేష్ హీరోగా నటించిన క్లాసిక్ హిట్స్ 'నువ్వు నాకు నచ్చావ్', 'మల్లీశ్వరి' చిత్రాలకు త్రివిక్రమ్ మాటలు అందించిన సంగతి తెలిసిందే. ఆ చిత్రాల్లోని సంభాషణలు, వెంకటేష్ కామెడీ టైమింగ్ ప్రేక్షకులను ఎంతగానో ఆకట్టుకున్నాయి. మళ్లీ ఇన్నాళ్లకు వీరిద్దరి కాంబినేషన్‌లో పూర్తిస్థాయి ఫ్యామిలీ ఎంటర్‌టైనర్ వస్తుండటంతో సినిమాపై విపరీతమైన క్రేజ్ నెలకొంది. ఈ చిత్రాన్ని గాంధీ జయంతి సందర్భంగా అక్టోబర్ 2న ప్రపంచవ్యాప్తంగా థియేటర్లలో గ్రాండ్‌గా విడుదల చేసేందుకు నిర్మాతలు సన్నాహాలు చేస్తున్నారు. తాజా అప్‌డేట్‌తో సినిమాపై అంచనాలు మరింత పెరిగాయి.



# విభిన్న పాత్రలను ఎంచుకుంటా

తెలుగుతో పాటు బాలీవుడ్‌లో విభిన్నమైన పాత్రలను ఎంచుకుంటూ దూసుకుపోతున్న ప్రముఖ నటి రకుల్ ప్రీత్ సింగ్, తాజాగా తన కెరీర్ ఆకాంక్షలపై ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. తన సినీ ప్రయాణంలో ఇప్పటివరకు పూర్తి స్థాయి, హృదయాలను హత్తుకునే ఇంటెన్స్ లవ్ స్టోరీలో నటించలేదని, అలాంటి ఎమోషనల్ రొమాంటిక్ డ్రామాలో నటించాలనే బలమైన కోరిక ఉందని వెల్లడించారు. అలాగే చారిత్రాత్మక నేపథ్యం ఉన్న పీరియడ్ డ్రామాలు లేదా హర్రర్ జోనర్‌లలో ఇప్పటివరకు భాగం కాలేదని, ఆ జోనర్లలో కూడా విభిన్నమైన ప్రయోగాలు చేయాలనుకుంటున్నట్లు తెలిపారు. ఇప్పటివరకు చేసిన పాత్రలకు భిన్నంగా, నటిగా తనలోని సామర్థ్యాన్ని సవాల్ చేసే స్క్రిప్ట్‌లను ఎంచుకోవడమే ఇకపై తన ప్రాధాన్యత అని ఆమె స్పష్టం చేశారు. ఇకపై సినిమాల విషయంలో బిగ్ బ్యానర్ లేదా జానర్ ప్రాధాన్యత కంటే, తను పోషించే పాత్రకు ఎంతవరకు ప్రాధాన్యం ఉందనేది ముఖ్యమని రకుల్ తెలిపారు. కేవలం తెరపై కనిపించడం మాత్రమే కాకుండా, నటిగా తనను మానసికంగా ఉత్తేజపరిచే మరియు కొత్తదనంతో కూడిన సవాలుతో కూడిన పాత్రలనే అంగీకరిస్తానని ఆమె స్పష్టంచేశారు. ప్రముఖ దర్శకుడు నితీశ్ తివారీ ప్రతిష్టాత్మకంగా తెరకెక్కిస్తున్న పౌరాణిక చిత్రం 'రామాయణం'లో రకుల్ శూర్పణఖ పాత్రలో కనిపిస్తున్నారు. రణ్‌బీర్ కపూర్ (రాముడు), సాయి పల్లవి (సీత), యష్ (రావణుడు), కాజల్ అగర్వాల్ (మండోదరి) ప్రధాన పాత్రల్లో నటిస్తున్న ఈ మోస్ట్ అవైటెడ్ చిత్రం మొదటి భాగం నవంబర్ 6న అంతర్జాతీయంగా విడుదల కానుంది.

The imprint line should be printed legibly as Printed by Published by BADHE JAYASHREE on behalf of BADHE JAYASHREE, printed at and published at PLOT NO. 104, KAPIL KAUSALYA APARTMENT, SHILPA CERENY COUNTY VENCHER, POTHIREDDYPALLY, editor BADHE JAYASHREE.